ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పల్నాడు జిల్లా వార్తలు
5
శనివారం 30 మార్చి 2024



రాజకీయ దిగ్గజాలకు నిలయం

తెనాలి నియోజకవర్గం నుంచి గెలుపోటములు పొందిన దిగ్గజాలుకూడా ఉన్నారు. ఇద్దరు మాజీ ముఖ్యమంత్రులు ఇక్కడ పోటీ చేశారు. నాదెండ్ల భాస్కరరావు 1989లో ఇక్కడి నుంచి గెలిచారు. 1994లో రెండోసారి పోటీచేసి ఓటమి పాలయ్యారు. 1999లో మరో మాజీ ముఖ్యమంత్రి, తమిళనాడు గవర్నర్‌గా చేసిన కొణిజేటి రోశయ్య తెనాలి నుంచి పోటీచేసి గోగినేని ఉమ చేతిలో ఓటమి చెందారు. తెనాలికి రాజకీయంగానే కాకుండా కళాపరంగానూ ఎందరో ప్రముఖులున్నారు. రాజకీయ రంగం తర్వాత తెనాలి కళలకు ప్రసిద్ధి. సినీ రంగంలో ఎందరో ప్రముఖులు నియోజకవర్గ కేంద్రం నుంచి ఉన్నారు. సీనియర్ నటుడు సూపర్‌స్టార్ ఘట్టమనేని కృష్ణ, నటి ఊర్వశి శారద కూడా రాజకీయంగా గెలిచారు. శారద గతంలో తెనాలి పార్లమెంటు ఉన్న సమయంలో ఎంపీగా గెలిచారు. కృష్ణకొంగర జగ్గయ్యలు కూడా గతంలో గెలుపొందారు.

నియోజకవర్గ ముఖచిత్రం




• ఆలపాటి వెంకటరామయ్య


• దొడ్డపనేని ఇందిర


• అన్నాబత్తుని సత్యన్నారాయణ


• నాదెండ్ల భాస్కరరావు



• నాదెండ్ల మనోహర్


• ఆలపాటి రాజా


• రావి రవీంద్రనాథ్


• అన్నాబత్తుని శివకుమార్


• గోగినేని ఉమ


• కొణిజేటి రోశయ్య

ఉద్దండుల జయాపజయాలు...

తెనాలి ఎందరో ఉద్దండులకు రాజకీయ వేదికగా నిలిచింది. కొణిజేటి రోశయ్య న్యాయవాద వృత్తి చేపట్టి తర్వాత రాజకీయాల్లోకి ప్రవేశించారు. ఆర్థికవేత్తగా మంచిపేరున్న ఆయన కాంగ్రెస్ మంత్రివర్గాలలో అనేకమంది ముఖ్యమంత్రుల కొలువులో ఆర్థిక మంత్రిగా పదవులను అలంకరించారు. తర్వాత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు ముఖ్యమంత్రిగా చేశారు. ఆ తర్వాత తమిళనాడు గవర్నర్‌గా పనిచేశారు. అయితే ఈయన ఎక్కువగా వేమూరు నుంచి పోటీలో నిలిస్తే, తెనాలిలో పోటీచేసిన ఒక్కసారి ఓటమి పాలయ్యారు. 1999లో పోటీచేసి గోగినేని ఉమ చేతిలో ఓటమి చెందారు. నాదెండ్ల భాస్కరరావు ఎన్టీఆర్ అనుచరునిగా, ఆ తర్వాత ఆయన ప్రభుత్వం కూల్చివేత అనంతరం ముఖ్యమంత్రిగా పనిచేశారు. అయితే ఆయన అతి తక్కువ కాలమే ముఖ్యమంత్రిగా పనిచేశారు. ఆయన కుమారుడు నాదెండ్ల మనోహర్ రాష్ట్ర విభజన సమయంలో స్పీకర్‌గా, నేడు జనసేన పార్టీలో క్రియాశీలకంగా ఉన్నారు. ప్రస్తుతం తెనాలి స్థానం నుంచి ఉమ్మడి అభ్యర్థిగా పోటీలో ఉన్నారు.

తెనాలి పార్లమెంట్‌లోనూ ఎందరో ప్రముఖులు

1952లో ఏర్పడిన తెనాలి పార్లమెంటు స్థానంలో ఎందరో ప్రముఖులు పోటీచేసి విజయాలు సాధించారు. అయితే 2004 ఎన్నికల తర్వాత ఈ పార్లమెంట్ స్థానం లేకుండాపోయింది. అప్పటి వరకు జరిగిన 14 ఎన్నికల్లో తొలి ఎంపీగా కొత్త రఘురామయ్య ఎన్నికయితే, తర్వాత ఎన్జీ రంగా, కమ్యూనిస్టు ప్రముఖులు కొల్లా వెంకయ్య, లావు బాలగంగాధర రావు ఇక్కడి నుంచి పోటీచేసి గెలిచారు. తర్వాత సినీనటి ఊర్వశి శారద, కేంద్రమంత్రులుగా చేసిన పి.శివశంకర్, ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు కూడా ఇక్కడ గెలిచి ఢిల్లీ పీఠంపై పదవులను దక్కించుకున్నారు. అయితే 2004లో జరిగిన ఎన్నికలే చివరివి అయితే, 2009 నాటికి తెనాలి పార్లమెంటు రద్దయి, గుంటూరు పార్లమెంటులో తెనాలి అసెంబ్లీ నియోజక వర్గాన్ని కలిపేశారు. దీంతో అప్పటి నుంచి తెనాలి కేవలం అసెంబ్లీ ఎన్నికలకే పరిమితమైంది.

నియోజక వర్గంలో ప్రధాన సామాజిక వర్గాల ఓట్లు

- కమ్మ : 31,000
- కాపు : 40,000
- వైశ్య : 21,000
- మాల : 30,000
- మాదిగ : 26,000
- బ్రాహ్మణ : 6,000
- రెడ్డి : 12,000
- ముస్లిం : 25,000
- యాదవ : 20,000
- పద్మశాలి : 10,000
- రాజులు : 2,000
- రజక : 8,000
- విశ్వబ్రాహ్మణ : 5,000
- గౌడ : 9,000
- నాయీబ్రాహ్మణ: 4,000
- మేదర : 1,500
- కుమ్మర : 1,500
- కుంకుపు : 500
- ముదిరాజులు: 1000
- లంబాడీ : 5,000
- ఎరుకల : 2,500
- యానాది : 2,500
- మార్వాడీ : 1,900

ప్రస్తుత ఎన్నికల్లో..

ప్రస్తుత ఎన్నికలకు అంతా సమాయత్తమయితే, అధికార వైసీపీ తరపున సిట్టింగ్ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ మరోసారి పోటీలో ఉండగా , గత ఎన్నికల్లో వేరువేరుగా పోటీచేసిన తెలుగుదేశం, జనసేన ఇప్పుడు బీజేపీతో కలసి పోటీలో నిలవటం, వీరి ఉమ్మడి అభ్యర్థిగా జనసేన నాయకుడు నాదెండ్ల మనోహర్ పోటీ పడుతుండటం ఇక్కడ ప్రత్యేకం. గత ఎన్నికల్లో విజయం సాధించిన వైసీపీ అభ్యర్థి శివకుమార్‌కు 94,495 ఓట్లు వస్తే, టీడీపీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు 76,846 ఓట్లు దక్కాయి. అయితే ఇక్కడ త్రిముఖ పోటీలో నాదెండ్ల మనోహర్ అనూహ్యంగా 29,905 ఓట్లు పొందారు. దీంతో శివకుమార్‌కు విజయం దక్కింది. అయితే ఇప్పుడు ఇద్దరు కాకుండా మూడు పార్టీల ఉమ్మడి అభ్యర్థిగా ఒక్కరే రంగంలోకి దిగటంతో చీలిన ఓట్లు ఆయనకు బలం చేకూర్చుతాయని, విజయాన్ని తెచ్చిపెడతాయనే ఆశాభావాన్ని ఆయా పార్టీలు వ్యక్తం చేస్తున్నాయి. అయితే పోటీ ఈసారి రసవత్తరంగా మారటం తెనాలి గడ్డపై ఉత్కంఠకు తెరలేపినట్టయింది.

స్వాతంత్రోద్యమ కాలంలో ఉవ్వెత్తున ఎగసిపడిన ఉద్యమ జ్వాలలు నేటికీ ఈ పోరాటాల గడ్డపై రాజకీయ చైతన్యం రూపంలో ఇంకా ఎగసిపడుతూనే ఉన్నాయి... ఎందరో అమర వీరుల త్యాగాలకు ప్రతిరూపంగా నిలిచిన తెనాలి కేవలం ఉద్యమాలకే కాకుండా, కళలకు నిలయంగా, ఎందరో కళాకారులను అందించింది. నిత్యం పచ్చని పైరులతో పచ్చచీర కట్టుకున్నట్టు కనిపించే తెనాలికి పట్టణం మధ్య నుంచి వెళ్లే మూడు కాల్వలు ప్యారిస్ పేరునూ తెచ్చిపెట్టి, ఆంధ్రా ప్యారిస్‌గా ఖ్యాతి పొందింది. ఈ మూడు కాల్వలు ప్రవహించటం వల్లే అప్పట్లో హిందీలో 'తీన్ నాల్' అని పిలిచేవారని, తీన్ అంటే మూడు, నాల్ అంటే కాల్వలు అనే అర్థం కావటంతో ఈ పదం కాలక్రమంలో తెనాలిగా మారిందనేది కూడా ఒక నానుడి.

రాజకీయ కళావేదిక తెనాలి

- స్వాతంత్రోద్యమాల నేల.. ఎందరో ఉద్దండులు ఏలిన నేల
- పోరాటాల పురిటిగడ్డపై ఎందరో ఉద్దండులు పోటీ
- వారసులకే ఇక్కడి ప్రజలు పట్టం
- తెనాలి రూటే సపరేటు.. ఇక్కడ ఎవరు గెలిస్తే ఆ పార్టీదే అధికారం
- 1985 నుంచి ఇదే ఆనవాయితీ
- రెండే మండలాలు... భారీగానే ఓటర్లు
- పార్లమెంట్ పోయి అసెంబ్లీ మిగిలె...

తెనాలి, మార్చి 29(ఆంధ్రజ్యోతి): తెనాలి పట్టణం పురపాలక సంఘంగా 1909లోనే ఏర్పడింది. క్రమక్రమంగా అభివృద్ధి చెందుతూ ప్యారిస్ అందాలను కూడా సొంతం చేసుకుంది. ఎంతో చారిత్రక ప్రాధాన్యం కలిగిన తెనాలి నుంచి ఎందరో స్వాతంత్ర సమరయోధులు, సినీ, నాటక రంగ ప్రముఖులు, రాజకీయ ఉద్దండులు పుట్టుకొచ్చారు. తెనాలి అసెంబ్లీ నియోజకవర్గం 1952లో ఏర్పడితే, పార్లమెంటరీ నియోజకవర్గం కూడా 1952లోనే ఏర్పాటయింది. అయితే 2004లో చివరి పార్లమెంటు ఎన్నికలు జరిగితే, 2009 నుంచి తెనాలి పార్లమెంటు స్థానాన్ని తీసేసి, దానిని గుంటూరు పార్లమెంటులో కలిపేశారు. తెనాలి పార్లమెంటు కింద 14సార్లు ఎన్నికలు జరిగితే, తెనాలి అసెంబ్లీ నియోజకవర్గం ఏర్పడ్డాక 15 సార్లు ఎన్నికలు జరిగాయి. 2024లో 16వ సారి ఎన్నికల జరగనున్నాయి. తెనాలి నియోజక వర్గంలో ఏ పార్టీ అభ్యర్థి గెలిస్తే ఆ పార్టీ రాష్ట్రం లో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందనే నానుడి ఉంది. తెలుగుదేశం ఆవిర్భావం నుంచి ఇది నిజమవుతూనే వచ్చింది. ఇక్కడ గెలిచిన అభ్యర్థులు ఆయా మంత్రివర్గాల్లో అత్యున్నత పదవులు అలంకరించిన సందర్భాలూ ఉన్నా యి.అటువంటి వారిలో నాదెండ్ల భాస్కరరావు, అన్నాబత్తుని సత్యన్నారాయణ, నాదెండ్ల మనోహర్ వంటివారున్నారు. అయితే ఆలపాటి వెంకటరామయ్య కుటుంబానికి ఎక్కువ సార్లు ఎమ్మెల్యే అయ్యే అవకాశం కలిగింది.


తెనాలి మున్సిపల్ భవనం

వారసత్వానికి పట్టం... ఏడుసార్లు ఏలిన ఒకే కుటుంబం

నియోజకవర్గం ఏర్పడ్డ తర్వాత ఇప్పటి వరకు 15 సార్లు ఎన్నికలు జరిగితే తొలి ఎమ్మెల్యేగా గెలుపొందిన ఆలపాటి వెంకట్రామయ్య కుటుంబం ఆరుసార్లు గద్దె నెక్కింది. ఆయన వరుసగా మూడు సార్లు గెలిస్తే, ఆయన కుమార్తె దొడ్డపనేని ఇందిర హ్యాట్రిక్ విజయాలను సాధించారు. ఒకసారి కాంగ్రెస్, మరోసారి స్వతంత్ర, మూడోసారి జనతాపార్టీ తరపున ఆమె గెలిచారు. వీరి తర్వా త ఇందిర కుమార్తె డాక్టర్ గోగినేని ఉమ 1999లో గెలిచారు. ఇది ఒక రికార్డయితే ఇక్కడ వీరి బాటలోనే వా రసులకు అవకాశాలు దక్కాయి. టీడీపీ ఆవిర్భవించాక ఆ పార్టీ తరఫున అన్నాబత్తుని సత్యన్నారాయణ 1983, 1985 ఎన్నికల్లో వరుసగా రెండు సార్లు గెలుపొందితే, ఆయన కుమారుడు శివకుమార్ గత 2019 ఎన్నికల్లో విజయం సాధించారు. మాజీ ముఖ్యమంత్రి నాదెండ్ల భాస్కరరావు 1989లో ఇక్కడ పోటీచేసి గెలుపొందితే, ఆయన కుమారుడు నాదెండ్ల మనోహర్ 2004, 2009 ఎన్నికల్లో వరుస విజయాలు సాధించారు. ఈయన అసెంబ్లీ స్పీకర్‌గా కూడా పని చేశారు.

నియోజకవర్గ ఓటర్లు 2,65,863

పురుషులు : 1,28,188

స్త్రీలు : 1,37,642

ఇతరులు: 33

సంవత్సరం	విజేత	పార్టీ	ఓటమి	పార్టీ	మెజార్టీ
1952	ఆలపాటి వెంకట్రామయ్య	కాంగ్రెస్	రావి అమ్మయ్య	సీపీఐ	8,077
1955	ఆలపాటి వెంకట్రామయ్య	కాంగ్రెస్	రావి అమ్మయ్య	సీపీఐ	8,295
1962	ఆలపాటి వెంకట్రామయ్య	కాంగ్రెస్	రావి అమ్మయ్య	సీపీఐ	6,198
1967	దొడ్డపనేని ఇందిర	కాంగ్రెస్	చింతమనేని సుబ్బారావు	స్వతంత్ర	32,335
1972	దొడ్డపనేని ఇందిర	స్వతంత్ర	నన్నపనేని వెంకట్రావు	కాంగ్రెస్	5753
1978	దొడ్డపనేని ఇందిర	జనతా	నన్నపనేని వెంకట్రావు	కాంగ్రెస్(ఐ)	2010
1983	అన్నాబత్తుని సత్యన్నారాయణ	స్వతంత్ర	దొడ్డపనేని ఇందిర	కాంగ్రెస్	29,224
1985	అన్నాబత్తుని సత్యన్నారాయణ	టీడీపీ	దొడ్డపనేని ఇందిర	కాంగ్రెస్	4589
1989	నాదెండ్ల భాస్కరరావు	కాంగ్రెస్	అన్నాబత్తుని సత్యన్నారాయణ	టీడీపీ	18,573
1994	రావి రవీంద్రనాథ్	టీడీపీ	నాదెండ్ల భాస్కరరావు	కాంగ్రెస్	13,531
1999	గోగినేని ఉమ	టీడీపీ	కొణిజేటి రోశయ్య	కాంగ్రెస్	5394
2004	నాదెండ్ల మనోహర్	కాంగ్రెస్	గోగినేని ఉమ	టీడీపీ	12,745
2009	నాదెండ్ల మనోహర్	కాంగ్రెస్	ఆలపాటి రాజేంద్రప్రసాద్	టీడీపీ	2884
2014	ఆలపాటి రాజేంద్రప్రసాద్	టీడీపీ	అన్నాబత్తుని శివకుమార్	వైసీపీ	19,065
2019	అన్నాబత్తుని శివకుమార్	వైసీపీ	ఆలపాటి రాజేంద్రప్రసాద్	టీడీపీ	17,649


ఈపూరు మండలంలో ఉప్పరపాలెం చెరువు పరిస్థితి ఇది.

చెరువులన్నీ.. వెలవెల

- చెరువులపై శ్రద్ధ చూపని పాలకులు, అధికారులు


శావల్యాపురం: వైకల్లులో నీరు ఎండిపోయిన తాగునీటి చెరువు


ఎండిపోయిన విఠంరాజుపల్లి చెరువు

వినుకొండ, మార్చి 29: ముందుచూపు కొరవడడంతో చెరువులు ఎండిపోయాయి. దీంతో తాగునీటి ఎద్దడి నెలకొంది. గ్రామాల్లో భూగర్భ జలాలు అడుగంటడంతో సాగుకు, తాగుకు నీటి ఇక్కట్లు ఎదురవుతున్నాయి. నియోజకవర్గంలో విఠంరాజుపల్లి చెరువుతోపాటు వివిధ గ్రామాల్లో 15 చెరువులు, శావల్యాపురం మండలం వయ్యకల్లుతోపాటు మరో 13 చెరువులు, ఈపూరు మండలం ఉప్పరపాలెం, పొనుగోటివారిపాలెం కలుపుకుని 9 చెరవులు, నూజండ్ల మండలంలో 15 చెరువులు ఉన్నాయి. నీరులేక అవన్నీ ఎండిపోయాయి. దీంతో గ్రామాల్లో భూగర్భ జలాలు పూర్తిగా అడుగంటాయి. మూగ జీవాల గొంతు తడవక, పంట భూములకు నీరు చేరక భూములు నెర్రెలు బారి కరువు కోరల్లో రైతాంగానికి వేదన కల్గిస్తోంది. నియోజకవర్గంలో మొత్తం 51 చెరువులు ఉండగా పెదకంచర్ల, నడిగడ్డ, భారతాపురం, దొండపాడు, కొప్పుకొండ, అందుగులపాడు, పిట్టంబండ, హసన్నాయునిపాలెం చెరువుల ద్వారా రైతులు పంటలు పండిస్తారు. నియోజకవర్గంలో మైనర్ ఇరిగేషన్ ద్వారా సుమారు 8,959 ఎకరాల పైబడి పంటలు పండాల్సి ఉంది. ఈ సంవత్సరం సాగర్ కాల్వ ద్వారా చెరువులకు నీరు అందించకపోవడంతో, వర్షాధారంపై ఆధారపడ్డ రైతులు కేవ లం 2,300 ఎకరాల్లో మెట్ట పంటలను మాత్ర మే పండించినట్లు అధికారులు చెబుతున్నారు. 51 చెరువులకు 509.93 ఎంసీఎఫ్‌టీ నీరు అవసరమని మైనర్ ఇరిగేషన్ అధికారులు చెబుతున్నా రు. గడిచిన ఐదేళ్లల్లో పాలకులు, అధికారులు చెరువులపై శ్రద్ధ చూపకపోవడంతో నీరులేక పల్లె గడపలకు కరువు తలుపు తడుతోంది. మూగ జీవాలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు కనీసం తాగునీటికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వ్యవ సాయంపై ఆధారపడే గ్రామాల్లో పంటలు పండక కొందరు పొట్ట చేతపట్టుకొని వలస పోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ విషయంపై మైనర్ ఇరిగేషన్ శాఖ అధికారి మురళిని వివరణ కోరగా నియోజకవర్గం చెరువులన్నీ ఎక్కువ భాగం సాగర్ కాల్వ పై ఉన్నాయని, కాల్వ నీరు చెరువుకు చేరే పరిస్థితి లేకపోవడంతో రైతులు వర్షాధారంపై ఆధారపడి పంటలు పండిస్తున్నార ని ఆయన తెలిపారు.

మార్చిలోనే.. మంటలు

- పెరిగిన పగటి ఉష్ణోగ్రతలు
- నరసరావుపేటలో 41.70 డిగ్రీల సెల్సియస్ నమోదు



నరసరావుపేట, మార్చి29: ఎండ తీవ్రత పెరిగింది. కొద్దిరోజుల పాటు చల్లగా ఉన్న వాతావరణం మళ్లీ వేడెక్కింది. మార్చి ముగియక ముందే సూర్యుడు సుర్రుమనిపిస్తున్నాడు. శుక్రవారం జిల్లాలోని పలు ప్రాంతాల్లో పగటి ఉష్ణోగ్రతలు 41 డిగ్రీల సెల్సియస్‌ను దాటాయి. సాధారణం కన్నా ఏడు డిగ్రీల ఉష్ణోగ్రత అధికంగా నమోదైనట్లు వాతావరణ శాఖ వెల్లడించింది. ఈ సీజన్‌లో 41 డిగ్రీలు దాటడం ఇదే ప్రథమం. రోజురోజుకు ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. ఇప్పుడే ఎండల తీవ్రత ఈ స్థాయిలో ఉంటే ఏప్రిల్, మే నెలల్లో పరిస్థితి ఎలా ఉంటుందోనన్న భయాందోళనలకు ప్రజలు గురవుతున్నారు. నరసరావుపేటలో 41.70 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. వెల్దుర్తి 41.57, గురజాల 40.91, మాచర్ల 40.79, వినుకొండ 40.79, శావల్యాపురం 40.67, కారంపూడి 40.59, నూజెండ్ల 40.30, బొల్లాపల్లి 40.20, ఈపూరు 40.18, దుర్గి 40.05 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు వైద్యులు సూచిస్తున్నారు. ఎండలో బయటకు వెళ్ళేవారు నీటిని ఎక్కువగా తాగాలని, రక్షణగా గొడుగు వాడితే మంచిదని వారు చెబుతున్నారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (సాయంత్రం) 6.25(శనివారం)
సహారీ (ఉదయం) 4.47 (ఆదివారం)

భక్తిశ్రద్ధలతో.. శుభ శుక్రవారం

- చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు

నరసరావుపేట, మార్చి 29: ప్రపంచ వ్యాప్తంగా క్రైస్తవులు జరుపుకునే పర్వదినా ల్లో ఒకటైన శుభ శుక్రవారం (గుడ్ ఫ్రైడే) వే డుకలు జిల్లావ్యాప్తంగా అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. అన్ని చర్చిలలో, సమాధుల తోట ల్లోనూ ప్రార్థనలు జరిగాయి. గురువులు, పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి గుడ్ ఫ్రైడే సందేశమిచ్చారు. సర్వమానవాళి పాప పరిహారం నిమిత్తం శిలువపై ఏసు క్రీస్తు ప్రాణ త్యాగం చేసిన సందర్భాన్ని పురస్కరించుకుని శిలువలో ప్రభువు పలికిన ఏడు మాటల విశిష్టత గురించి వివరించారు. నాటి క్రీస్తు శ్రమలు, కష్టాలను గుర్తు తెచ్చుకుని కన్నీటి ప్రార్థనలు చేశారు. అన్ని చర్చిలు భక్తులతో కిటకిటలాడాయి. మృతుల ఆత్మలకు శాంతి కలగాలని కోరుతూ సమాధుల తోటల్లో కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీటి ప్రార్థనలు చేశారు. వారిని గుర్తు చేసుకుంటూ సమాధులపై పుష్ప గుచ్ఛాలు ఉంచి క్యాండిల్స్ వెలించి ప్రార్థనలు చేశారు. గత 40 రోజులుగా ఉపవాస దీక్షలతో ఉండే క్రైస్తవులు ప్రార్థనల అనంతరం దీక్ష విరమించారు. ప్రధాన రహదారుల్లో శిలువ యాత్ర నిర్వహించారు. నరసరావుపేటలోని బాప్టిస్ట్ చర్చి, లూథ రన్, సెయింట్ ఆన్స్ తదితర చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి.


రెంటచింతల ఆర్‌సీఎం చర్చిలో శిలువ మోస్తున్న భక్తులు

చిలకలూరిపేటకు చెందిన వైసీపీ నేత మల్లెల రాజేష్ నాయుడు, అయన అనుచర వర్గం శుక్రవారం హైదరాబాద్‌లో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్, మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు సమక్షంలో పసుపు కండువా కప్పుకున్నారు.



అమరావతిని అభివృద్ధి చేసి చరిత్రలో నిలవాలి

● 1564వ రోజుకు చేరుకున్న ఆందోళనలు



బిల్డ్ అమరావతి అంటూ తుళ్లూరులో ఇళ్ల వద్ద నినాదాలు చేస్తున్న మహిళలు

తుళ్ళూరు, మార్చి 29: అధికారం ఉంది కదా అని అమరావతిని నిర్వీర్యం చేసి సీఎం జగన్‌రెడ్డి అడ్డగోలుగా వ్యవహరించారని, రాజధాని అమరావతికి 33వేల ఎకరాలు త్యాగంచేసిన రైతులు పేర్కొన్నారు. బిల్డ్ అమరావతి, జై ఆంధ్రప్రదేశ్ అంటూ రైతులు, రైతుకూలీలు చేస్తున్న ఆందోళనలు శుక్రవారం నాటికి 1564వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా వెంకటపాలెం రైతుల ధర్నా శిబిరం, రాజధాని గ్రామాల్లో ఇళ్ల వద్ద నుంచి నిరసన దీక్షలు, ఆందోళనలు చేస్తున్న పలువురు రైతులు, మహిళలు మాట్లాడారు. పదవులు ఎప్పుడూ అధికారం శాశ్వతంగా కాదన్నారు. సీఎం జగన్‌రెడ్డి ప్రజావేదిక కూల్చివేసి, పోలవరం, అమరావతి నిర్వీర్యం చేసి చరిత్ర హీనుడని ప్రజలు చెప్పుకునే విధంగా ఈ ఐదేళ్ల పరిపాలన చేశాడన్నారు. రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం చెప్పిన తీర్పును లెక్క చేయకుండా కాలక్షేపం చేసేవారిని ఎన్నికల్లో అడ్రస్ లేకుండా చేయాలన్నారు. అమరావతి వెలుగు కార్యక్రమం కొనసాగింది. దీపాలు వెలిగించి బిల్డ్ అమరావతి అంటూ నినాదాలు చేశారు. రాజధాని 29గ్రామాల్లో రైతుల నిరసన దీక్షలు, ఆందోళన కొనసాగాయి.

తెలుగువాడి ఆత్మగౌరవానికి ప్రతీక ఎన్టీఆర్

● మాజీ మంత్రి ఆనందబాబు



ఎన్టీఆర్‌కు నివాళులు అర్పించిన అనంతరం ప్రసంగిస్తున్న మాజీమంత్రి ఆనందబాబు

వేమూరు, మార్చి 29: ఎన్టీఆర్ స్ఫూర్తితో రాష్ట్రాన్ని పునరుజ్జీవింప చేసుకునే అవసరం ఎంతైనా ఉందని మాజీమంత్రి, తెలుగుదేశం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు నక్కా ఆనందబాబు పేర్కొన్నారు. టీడీపీ 42వ ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమాన్ని శుక్రవారం నియోజకవర్గ కేంద్రమైన వేమూరులోని టీడీపీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. బాపట్ల పార్లమెంటరీ స్థాయి టీడీపీ అధికార ప్రతినిధి జొన్నలగడ్డ విజయబాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి విచ్చేసిన ఆనందబాబు ముందుగా ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలుగువారి ఆత్మగౌరవాన్ని ప్రతీక ఎన్టీఆర్ అన్నారు. నాడు ఆయన ప్రవేశపెట్టిన అనేక సంక్షేమ పథకాలు ఈనాడు దేశవ్యాప్తంగా ప్రభుత్వాలు అమలులోకి తెచ్చాయన్నారు. ఎన్టీఆర్ ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరు అడుగులు వేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర మైనార్టీ సెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ షేక్ హనీఫ్, నియోజకవర్గం జనసేన పార్టీ సమన్వయకర్త ఊసా రాజేష్, బీసీ సంఘ నేత తులం రమేష్‌బాబు, పల్లా వాసుదేవరాయుడు, చావలి సర్పంచ్ విష్ణుమొలకల శ్రీనివాసరావు, తెలుగు రైతు నాయకులు బండారు సూరిబాబు, వేమూరి మురళీకృష్ణ, మన్నే పసి, గోపినాథ్, రాజేష్, కొండ్రుబుల్లియ్య, అనే ప్రసాద్, యలవర్తి సురేంద్ర, కోగంటి శ్రీనుబాబు, శివకృష్ణ, వేల్పుల రవి, ఉక్కుర్తినాగయ్య, దాది లక్ష్మణరావు, గంటా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

చిలకలూరిపేటలో వైసీపీకి బిగ్ షాక్

● మల్లెల రాజేష్ నాయుడు సహా..

● 25 మంది వైసీపీ నుంచి టీడీపీలో చేరిక



టీడీపీలో చేరిన రాజేష్ నాయుడు తదితరులతో నారా లోకేశ్, పుల్లారావు

చిలకలూరిపేట, మార్చి 29: చిలకలూరిపేటలో వైసీపీకి బిగ్ షాక్ తగిలింది. చిలకలూరిపేట వైసీపీ అభ్యర్థిగా తొలుత ప్రకటించబడి అవమానానికి గురైన మల్లెల రాజేష్ నాయుడు, కొలిశెట్టి శ్రీనివాసరావు, 10 మంది మునిసిపల్ కౌన్సిలర్లు, ఒక జడ్‌పీటీసీ సహా మొత్తం 25 మంది వైసీపీ ముఖ్యులు ఆ పార్టీని వీడి తెలుగుదేశంలో చేరారు. హైదరాబాదులో శుక్రవారం టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్, మాజీ మంత్రి, చిలకలూరిపేట టీడీపీ అభ్యర్థి పత్తిపాటి పుల్లారావు సమక్షంలో వీరంతా టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. లోకేష్ వీరందరికీ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి స్వాగతం పలికారు.

ప్రస్తుతం ఇక్కడి నుంచి ఎమ్మెల్యేగా ఉండి, మంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తున్న మంత్రి విడదల రజినిపైనా కొద్ది రోజుల క్రితమే రాజేష్ నాయుడు సంచలన ఆరోపణలు చేశారు. రజిని నిష్క్రమణ అనంతరం ఇప్పటి వరకు వైసీపీ సమన్వయకర్తగా కూడా ఉన్న ఆయన మంత్రి రజిని రు.6.5 కోట్లు డబ్బు తీసుకుని మోసం చేశారని వెల్లడించారు. అదే విషయంపై ప్రభుత్వ సలహాదారు సజ్జల వద్ద పంచాయతీ కూడా జరిగిందని బాంబు పేల్చారు. అనంతరం పరిణామాల్లోనే ఆకస్మికంగా చిలకలూరిపేట అభ్యర్థిని మార్చిన సీఎం జగన్.. రాజేష్ నాయుడు స్థానంలో కావటి మనోహర్ నాయుడుకు బాధ్యతలు ఇచ్చారు.

అన్యాయాలను భరించలేకనే పార్టీని వీడాం : మల్లెల

ఈ సందర్భంగా రాజేష్ నాయుడు మాట్లాడుతూ 2019 ఎన్నికల్లో వైసీపీ విజయానికి తనతో పాటు ఎంతోమంది నాయకులు దోహదపడ్డారన్నారు. కొంతకాలంగా అక్కడ జరుగుతున్న విపరీత పరిణామాలు, ఆ పార్టీ చేపడుతున్న కార్యక్రమాలపై విసుగు చెంది, తమకు జరిగిన తీవ్ర అన్యాయాన్ని భరించలేకే వైసీపీని వీడాల్సివచ్చిందన్నారు. ఐదేళ్లుగా చిలకలూరిపేటలో మంత్రి విడదల రజిని భూదందాలు మొదలు నిరుపేదలు, చిన్న చిన్న వ్యక్తుల పొట్టకొట్టడం కూడా జరిగిందన్నారు. ఆ తర్వాతే చిలకలూరిపేటలో గెలవడం అసాధ్యం, ఇక ఎందుకు పనికిరానని తెలుసుకొని గుంటూరు పశ్చిమలో సీటు సాధించుకున్నారన్నారు. స్థానిక వ్యక్తికే సీటు కేటాయించాలని ఎన్నోసార్లు కోరనా పట్టించు కోలేదన్నారు. అందుకే మన చిలకలూరిపేటను మనమే బాగుచేసుకోవాలనే ఉద్దేశంతో టీడీపీని, ప్రత్తిపాటి పుల్లారావును బలపరచాలని నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు.

వైసీపీని వీడి టీడీపీలో చేరికలు

టీడీపీలో చేరినవారిలో యడ్లపాడు మండల జడ్పీటీసీ సభ్యులు ముక్తా వాసు, చిలకలూరిపేట మునిసిపల్ వైస్ చైర్మన్ కొలిశెట్టి శ్రీనివాసరావు, మునిసిపల్ కౌన్సిలర్లు తులం సుధాకర్, చెమిటిగంటి పార్వతిదేవి, బిట్రా రాజేంద్రప్రసాద్, షేక్ జమీలా, జాలాది సుబ్బారావు, కౌన్సిలర్, వైసీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బేరింగ్ మౌలాలి, ఎస్సీసెల్ రాష్ట్ర నాయకులు పంగులూరి వెంగళరాయుడు, గణపవరం కు చెందిన బెల్లంపల్లి అచ్చయ్య, కాట్రు శ్రీనివాసరావు, కట్టుబడి వారి పాలెంకు చెందిన మాజీ సర్పంచ్ తిమ్మిశెట్టి కోటేశ్వరరావు, వైసీపీ సీనియర్ నాయకులు గాలి బుచ్చయ్య, బీసీసెల్ పట్టణ అధ్యక్షుడు, వైసీపీ ముఖ్య నాయకుడు ఎం.వి.రత్నారెడ్డి, మహిళా విభాగం పట్టణ అధ్యక్షురాలు యాదాల సుజాత, బుక్కాపురం సర్పంచ్ అల్లం ఆంజనేయులు, విద్యార్థి విభాగం నాయకులు నాగూర్, ఇక్బాల్, గౌస్‌లు, సీనియర్ నాయకులు రామిశెట్టి తాండవేశ్వరరావు, తోట సీతయ్య, కోట నాగపూర్ణచంద్రరావు, గుంజి బాజిలతోపాటు పలువురు నాయకులు ఉన్నారు.

ఎన్నికల అధికారిపై వైసీపీ నిఘా: ధూళిపాళ్ళ

● సాక్షి భవనారాయణ స్వామి ఆలయం భూముల అన్యాక్రాంతానికి జీవో



సమావేశంలో మాట్లాడుతున్న ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్

పొన్నూరుటౌన్, మార్చి29: ఎన్నికల అధికారిపై వైసీపీ నాయకత్వం సొంత పత్రిక విలేకరిని నిఘా పెట్టి బెదిరింపులు ప్రలోభాలకు గురిచేయాలని చూస్తున్నారన్ని మాజీ ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ ఆరోపించారు. శుక్రవారం నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ అధికార పార్టీకి చెందిన ఒక నాయకుడు ఫోన్ సంభాషణే ఇందుకు ఆధారం అని స్పష్టం చేశారు. సదరు నాయకుడు వైసీపీ సొంత పత్రిక విలేకరికి ఫోన్ చేసి ఎన్నికల అధికారి ఎవరెవ్వరిని కలుస్తున్నారో, ఎక్కడి వెళ్లుతున్నారు, ఏం చేస్తున్నారు మొత్తం వివరాలు నిఘా పెట్టాలని ఆ ఫోన్ సంభాషణలో కోరినట్లు చెప్పారు. ఇందుకు సంబంధించిన ఆడియో సరైన సమయంలో విడుదల చేస్తామన్నారు. సంబంధం లేని విషయంలో తమను ఇరికించాలనే ప్రయత్నాలను మానుకోవాలని నరేంద్ర స్పష్టం చేశారు. ఎన్నికల అధికారులను వైసీపీ పెద్దలు భయపెట్టి, ప్రలోభపెట్టి తమకు అనుకూలంగా వ్యవహరించేలా చర్యలు తీసుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వీటిపై ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయనున్నట్లు చెప్పారు.

ఎన్నికల అధికారులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపిన సైకిల్ వ్యవహారంలో ప్రభుత్వమే సిగ్గు పడాలిసిన అవసరం ఉందన్నారు. పేద బాలికలు బడికి వెళ్లటానికి 2019 ముందు ప్రభుత్వం ఉచితంగా సైకిళ్లను అందచేసిందన్నారు. ఆ సైకిళ్లను కూడా ఎన్నికల కేసు సాకు చూపి వదిలివేశారన్నారు, అయితే కోర్టు ఆదేశాల ప్రకారం ప్రభుత్వ ఆస్థిని వేలం వేయగా ఓ ప్రైవేటు వ్యక్తి వాటిని వేలంలో పాడుకున్నారన్నారు. ఆ సైకిళ్లు పంపిణీ చేస్తున్నారని తప్పుడు ఫిర్యాదు అందచేసిన వ్యక్తి ఎవరో బహిరంగ పరిచే ధైర్యం అధికారులకు ఉందా అని ప్రశ్నించారు.

భవనారాయణ స్వామి భూముల కబ్జాకు యత్నం..

సాక్షి భవనారాయణ స్వామి ఆలయానికి చెందిన విలువైన భూములు కబ్జా చేయటానికి వైసీపీ నాయకుల ప్రయత్నాలు కొనసాగుతున్నాయని నరేంద్ర ధ్వజమెత్తారు. ఎన్నికల కోడ్ అమలులోకి రావటానికి సరిగా మూడు రోజుల ముందు 16 ఎకరాల భవనారాయణ స్వామి భూమిని లాంగ్ లీజ్‌కు ఇవ్వాలని దేవాదాయ శాఖ ఉత్తర్వులు ఇవ్వటం అనుమానాస్పదంగా ఉందన్నారు. ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య కన్ను ఈ భూములపై పడిందని ఆరోపించారు. ఈ భూములపై కన్ను ఉన్నందునే రోశయ్య తన సతీమణిని పాలకవర్గ సభ్యురాలుగా చేర్చారని ఆరోపించారు. ఈ విషయంపై తాము గతంలో పోరాడితే ఆటోనగర్‌కు అడ్డంకులు సృష్టిస్తున్నారని తమపై దుష్ప్రచారం చేశారని ఆరోపించారు. 22ఎ చట్టం క్రింద భూములు నమోదై సామాన్యులు పడుతున్న ఇబ్బందులు ఎందుకు గుర్తించలేదని ప్రశ్నించారు. అనమర్లపూడి గ్రామంలో దళితులకు సంబంధించిన 23 ఎకరాల భూములను కూడా ఇలాగే ఉత్తర్వులు తెచ్చుకొని హస్తగతం చేసుకున్నారని ఆరోపించారు. వీటన్నిటిపై సమగ్ర విచారణ కోరనున్నట్లు నరేంద్ర కుమార్ తెలిపారు. ఈ సమావేశంలో టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అరాచక ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపుదాం

● గురజాల ఉమ్మడి అభ్యర్థి యరపతినేని పిలుపు



దాచేపల్లిలో బీజేపీ ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న యరపతినేని

దాచేపల్లి, మార్చి 29: రాష్ట్రంలో అరాచక పాలన సాగిస్తున్న వైసీపీ ప్రభుత్వాన్ని ఇంటికి పంపడమే లక్ష్యంగా పనిచేయాలని గురజాల ఉమ్మడి అభ్యర్థి యరపతినేని శ్రీనివాసరావు కోరారు. శుక్రవారం నారాయణపురంలోని నాగిరెడ్డి కల్యాణ మండపంలో బీజేపీ గురజాల నియోజకవర్గ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన యరపతినేని మాట్లాడుతూ కేంద్ర పథకాలన్నీ రాష్ట్రప్రభుత్వ పథకాలుగా చెప్పుకుంటూ రాష్ట్రంలో అరాచక పాలన సాగిస్తోందన్నారు. గత 40 ఏళ్లలో ఏ ప్రభుత్వం చేయనటువంటి దుర్మార్గాలు, హత్యలు, దోపిడీలు, మైనింగ్ మాఫియా ఈ ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వంలో జరిగిందన్నారు. రానున్న టీడీపీ ప్రభుత్వంలో సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా అందరం కలిసి పనిచేద్దామని యరపతినేని పిలుపునిచ్చారు. బీజేపీ పల్నాడు జిల్లా అధ్యక్షులు ఆలోకం సుధాకర్‌బాబు, కొక్కెర శ్రీనివాసయాదవ్‌లు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ నిధుల తో చేసిన అభివృద్ధి పనులకు రాష్ట్ర ప్రభుత్వం తమ పార్టీ రంగులు వేసి జగన్ బొమ్మలు వేశారని విమర్శించారు. ఆఖరుకు పేద ప్రజలకు అందిస్తున్న ఉచిత బియ్యం కూడా ప్రధానమంత్రి మోదీ ప్రభుత్వం అందిస్తున్నవేనని తెలిపారు రానున్న ఎన్నికలలో ఎన్‌డీఏ ఉమ్మడి అభ్యర్థి యరపతినేని శ్రీనివాసరావును భారీ మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో బిజెపి నాయకులు కేతనబోయిన హనుమంతరావు, పునుగుల రవిశంకర్, మువ్వల వెంకట మనోజ్, ఆరె వెంకటేశ్వర్లు, మల్లెమారపు నాగేశ్వరరావు, బొడ్డు పెదనరసింహారావు, కొఠారి సురేష్, సైదారావు, కేశానుపల్లి నరసింహారావు, స్వర్ణ సుబ్బారావు, గురజాల, మాచవరం మండలాల బిజెపి అధ్యక్షులు, టీడీపీ నాయకులు బెల్లంకొండ భద్రి, తంగెళ్ల శ్రీనివాసరావు, డాక్టర్ కర్నాటి వరలక్ష్మీ, జనసేన నేతలు మందపాటి దుర్గారావు, బడిదల శ్రీనివాసరావు, అంబటి మల్లి తదితరులు పాల్గొన్నారు.

గడువు దాటాక ఫాం.. 8 దాఖలు

● ఆర్వో లాగిన్‌లో నిలిచిన జాబితా

● వైసీపీ అభ్యర్థి అనుచరులు దాఖలు చేసినట్లు ప్రచారం

వేమూరు, మార్చి 29: ఇతర నియోజకవర్గాలకు చెందిన కొందరు ఓటర్లు వేమూరు నియోజకవర్గానికి తమ ఓటును బదిలీ కోరుతూ ఫామ్ 8 దరఖాస్తులను ఆన్‌లైన్‌లో దాఖలు చేసినట్లు తెలుస్తోంది. సంబంధిత వ్యక్తులు వైసీపీ అభ్యర్థి అనుచరులుగా ప్రచారంలో ఉంది. ఈనెల 16వ తేదీలోగా క్లెయిమ్స్ దాఖలు చేసుకునే అవకాశం ఉంది. ఆ తదుపరి దాఖలు చేసిన వాటిని పరిశీలించే అవకాశం లేకుండా ప్రత్యేక లాగిన్‌లో నిలిచిపోయాయి. అయినప్పటికీ అధికార పార్టీకి చెందిన వ్యక్తులు ఎలాగైనా దాఖలు చేసిన ఫామ్ 8లకు అనుమతి పొందేలా ప్రయత్నిస్తున్నట్టుగా తెలుస్తోంది. 2023 ఏప్రిల్ ఒకటి నుంచి 2024 మార్చి 25 వరకు నియోజకవర్గంలోని ఐదు మండలాల పరిధి 89గ్రామాల ద్వారా వివిధ రకాల పరిష్కారాలు కోరుతూ 12,652 మంది ఓటర్లు దరఖాస్తు చేశారు. వాటిలో 126 దరఖాస్తులను బీఎల్‌ఓల పరిశీలనకు పంపా రు. బీఎల్‌వోలు 17 దరఖాస్తులను ప్ర త్యేక పరిశీలనకు అధికారులకు పంపా రు. 91దరఖాస్తులను ఈఆర్వోకు దాఖలు చేశారు. 1429 దరఖాస్తులను తిరస్కరించారు. కాగా చివరికి 10,989 దరఖాస్తులను అనుమతించారు. 234 దరఖాస్తులు మాత్రం పెండింగ్లో ఉన్నాయి. ఇదిలా ఉండగా ఎన్నికల కమీషన్ ఆదేశాల మేరకు ఫామ్ 8ల దరఖాస్తుకు ఈనెల 16తో గడువు పూర్తయినప్పటికీ గడువు ముగిశాక కొందరు వ్యక్తులు ఇతర నియోజకవర్గాల నుంచి వేమూరు నియోజకవర్గానికి ఓటు హక్కును మార్చుకునేందుకు దరఖాస్తు చేశారు. 200లకు పైగానే అలాంటి దరఖాస్తులను ఆన్‌లైన్‌లో పొందుపరిచినట్లు సమాచారం. దీనిపై ఈఆర్‌ఓను వివరణ కోరగా గడువు ముగిశాక దాఖలు చేసి దరఖాస్తులను ఎలాంటి పరిస్థితుల్లోనూ పరిశీలించే అవకాశం లేదన్నారు. అలాంటివన్నీ కూడా ఆర్వో లాగిన్‌లో నిలిచిపోయి ఉంటాయని వివరించారు. ఎలాంటి ఒత్తిళ్లకు లొంగకుండా ఎన్నికల కమీషన్ ఆదేశాలను తూచా తప్పకుండా పాటిస్తామని తెలిపారు.

వలంటీర్ల తొలగింపు

సత్తెనపల్లి, మార్చి29: ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా వైసీపీ కార్యక్రమంలో పాల్గొన్నందుకు పట్టణంలోని 11వ వార్డుకు చెందిన వలంటీర్లు కిరణ్ సాగర్, అఖిల్‌లను విధుల నుంచి తొలగించినట్టు మున్సిపల్ కమిషనర్ షమ్మి శుక్రవారం తెలిపారు. వలంటీర్లు, ప్రభుత్వ ఉద్యోగులు ఎవరూ పార్టీల కార్యక్రమాల్లో పాల్గొనరాదని తెలిపారు.

నాలుగు రోజుల పాటు రెండు ఎక్స్‌ప్రెస్‌ల రీషెడ్యూల్

గుంటూరు, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): గుంటూరు - బీబీనగర్ సెక్షన్‌లో చిట్యాల రైల్వేస్టేషన్ వద్ద అదనపు లూప్ లైన్ నిర్మాణానికి సంబంధించి నాన్ ఇంటర్‌లాకింగ్ పనుల కారణంగా నాలుగురోజుల పాటు రెండు రైళ్లను రీషెడ్యూల్ చేస్తున్నట్లు రైల్వేవర్గాలు తెలిపాయి. శుక్రవారం నుంచే ఈ రీషెడ్యూల్ అమలులోకి వచ్చింది. ఏప్రిల్ 1వ తేదీ వరకు నెంబరు. 17230 సికింద్రాబాద్ - త్రివేండ్రం సెంట్రల్ శబరి ఎక్స్‌ప్రెస్ గంట ఆలస్యంగా మధ్యాహ్నం 1.20కి బయలుదేరుతుంది. అలానే నెంబరు. 17646 రేపల్లె - సికింద్రాబాద్ ఎక్స్‌ప్రెస్ గంటన్నర ఆలస్యంగా ఉదయం 8.40కి బయలుదేరుతుంది. అలానే మార్గమధ్యలో ఈ రైలుని సుమారు గంట పాటు నిలిపేస్తారు.

వైసీపీకి మాజీ సర్పంచ్ రాజీనామా



యెనుముల పున్నారెడ్డి

గురజాలటౌన్, మార్చి 29: మండలంలోని జంగమహేశ్వరపురం మాజీ సర్పంచ్ యెనుముల పున్నారెడ్డి వైసీపీకి రాజీనామా చేశారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ వైసీపీ ఆవిర్భావం నుంచి పార్టీలో కీలకంగా వ్యవహరించానని, గ్రామంలో వైసీపీ నేతలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా వైసీపీకి రాజీనామా చేస్తున్నట్లు చెప్పారు.

గెలిస్తే రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తాం

● ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు

● చెత్తపై పన్నువేసిన చెత్త ముఖ్యమంత్రి జగన్: కన్నా



ప్రజలకు అభివాదం చేస్తున్న శ్రీకృష్ణ దేవరాయులు, కన్నా

ముప్పాళ్ళ మార్చి 29: రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తాం అనుకుంటేనే ఓటు వేయాలని, నిజాయితీ నిబద్ధత కలిగినవారిని గెలిపించాలని నరసరావుపేట ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, టీడీపి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. మండలంలోని ఇరుకుపాలెం, రుద్రవరం, తొండపి, దమ్మాలపాడు, బొల్లవరం, ముప్పాళ్ళ, గోళ్ళపాడు, కుందురువారిపాలెం, లంకెలకూరపాడు, పలుదేవర్లపాడు గ్రామాల్లో శుక్రవారం బీజేపి, జనసేన నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ వరికెపూడిశెల ప్రాజెక్టును పూర్తిచేసి తాగునీటి సమస్యలను తీరుస్తానన్నారు. కన్నా మాట్లాడుతూ చెత్తపై పన్నువేసిన చెత్త ముఖ్యమంత్రి జగన్ అన్నారు. రాష్ట్రం ఆర్థికంగా వెనుక బడిందన్నారు. ముప్పాళ్ళలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు బత్తుల నాగేశ్వరరావు, సర్పంచులు మల్లవరపు చంద్రశేఖర్, పోలూరి యలమంద, పాతూరి అయోధ్య, గోగినేని కోటేశ్వరరావు, రావిపాటి మధుబాబు, నానయ్య, గంగారాం ఖాశిం, లీలాఫర్, మాభుసుభాని, రవీంద్రారెడ్డి, శిరిగిరి వెంకటరావు, తోడేటి రవి, మనోజ్, అబ్దుల్ మజీద్, అత్తోట కృష్ణ, డివి నారాయణ, ఉగ్గం యలమందరావు, గుత్తా రామారావు తదితరులు పాల్గొన్నారు.

మండలంలో బారీగా టీడీపీలో చేరికలు

మండల టీడీపీ అధ్యక్షుడు బత్తుల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో మండలంలోని పలు గ్రామాల్లో వైసీపీ నాయకులు కార్యకర్తలు టీడీపీలో చేరారు. వారికి ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, కన్నా లక్ష్మీనారాయణలు కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఇరుకుపాలెంలో ఎంపీటీసీ బత్తుల విజయలక్ష్మి ఆమె భర్త రామకృష్ణ మరి కొందరు, కూరపాడులో యర్రం మస్తాన్‌రెడ్డి, యర్రం అప్పిరెడ్డి, మలిరెడ్డి చంద్రారెడ్డి, మలిరెడ్డి శ్రీనివాసరెడ్డి(పెదకాపు), మలిరెడ్డి శ్రీనివాసరెడ్డి, మలిరెడ్డి బ్రహ్మారెడ్డి, ఎస్‌కే మస్తాన్‌వలి, పలుదేవర్లపాడులో ఉపసర్పంచ్ లావు సాంబశివరావు, కంచేటి కుచేలరావు, చక్రవరపు బ్రహ్మారాజు మరో 10మంది, ముప్పాళ్ళలో 10 కుటుంబాల వారు వైసీపీని వీడి టీడీపీలో చేరారు.

కార్యకర్తలే టీడీపీకి శ్రీరామరక్ష

● టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు



ఎన్టీఆర్, డాక్టర్ కోడెల ప్రతిమలకు నివాళులర్పిస్తున్న జీవీ ఆంజనేయులు, డాక్టర్ చదలవాడ, డాక్టర్ కడియాల, గోనుగుంట్ల కోటేశ్వరరావు తదితరులు

నర సరావుపేట టౌన్, మార్చి 29: టీడీపీ జెండాలు మోసిన లక్షలాదిమంది కార్యకర్తల కృషి మరచిపోలేనిదని టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు అన్నారు. శుక్రవారం టీడీపీ 42వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నరసరావుపేటలోని టీడీపీ పల్నాడు జిల్లా కార్యాలయం ఆవరణలో టీడీపీ జెండాను ఆవిష్కరించారు. అన్న ఎన్టీ రామారావు, డాక్టర్ కోడెల శివప్రసాదరావు ప్రతిమలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ కార్యకర్తలే టీడీపీకి శ్రీరామరక్ష అనిఅన్నారు. పార్టీ ఆశయసాధన కోసం కృషిచేస్తున్న ప్రతి కార్యకర్తలకు శుభాకాంక్షలు, ధన్యవాదాలు తెలిపారు. దేశ చరిత్రలోనే మహిళలకు ఆస్తిహక్కు కల్పించిన ఘనత అన్న ఎన్టీఆర్‌కే దక్కుతుందన్నారు. టీడీపీ నరసరావుపేట నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ 42 ఏళ్ళుగా పార్టీకి అండగా ఉండి, పార్టీకి వెన్నంటి కార్యక్రమాలు ముందుకు తీసుకెళుతున్న నాయకులు, కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు. టీడీపీ జిల్లా ప్రధానకార్యదర్శి కొట్టా కిరణ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో టీడీపీ డాక్టర్ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ కడియాల వెంకటేశ్వరరావు, యువనేత డాక్టర్ కడియాల లలిత్‌సాగర్, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గోనుగుంట్ల కోటేశ్వరరావు, ఆట్లా చినవెంకటరెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వేల్పుల సింహాద్రియాదవ్, తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు కుమ్మెత కోటిరెడ్డి, వేములపల్లి వెంకటనరసయ్య, కొల్లి ఆంజనేయులు, తెలుగు రైతు రాష్ట్ర అధికార ప్రతినిధి గొట్టిపాటి జనార్దన్‌బాబు, అడుసుమల్లి అప్పారావు, టీడీపీ మైనారిటీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు షేక్ మాబు, టీడీపీ విభిన్న ప్రతిభావంతుల రాష్ట్ర అధ్యక్షుడు పూదోట ఆంథోని సునీల్‌కుమార్, రావర్ల జగ్గారావు, మైనారిటీ సెల్ నియోజకవర్గ అధికార ప్రతినిధి షేక్ మన్నాన్ షరీఫ్, కనుమూరి లక్ష్మీ, దాసరి ఉదయశ్రీ, అల్లంశెట్టి మోహనరావు, జాగర్లమూడి హనుమంతురావు పాల్గొన్నారు.

రూ. 1.16 కోట్ల నగదు సీజ్

గుంటూరు, మార్చి 29(ఆంధ్రజ్యోతి): ఎన్నికలకోడ్ అమలులో ఉన్నందున ఈసీ నిబంధనలకు విరుద్ధంగా ఎలాంటి పత్రాలులేకుండా తీసుకెళుతున్న నగదుని వివిధ శాఖలు స్వాధీనం చేసుకొంటున్నాయి. కోడ్ అమలులోకి వచ్చినరోజు నుంచి శుక్రవారం వరకు జిల్లావ్యాప్తంగా రూ.1.16 కోట్లను సీజ్‌చేశాయి. పోలీసుశాఖ రూ.70లక్షల వరకు నగదుని స్వాధీనం చేసుకొన్నది. సీజీఎస్‌టీ రూ.40లక్షలు, ఎస్‌జీఎస్‌టీ రూ.3లక్షలు, మిగతా శాఖలు కలిపి మరో రూ.3లక్షల వరకు నగదుని స్వాధీనపర్చుకొన్నట్లు జిల్లా ఎన్నికల అధికారి ఎం వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు.

ఎన్నికల ప్రచారంలో కళాశాల లైబ్రేరియన్

● సస్పెండ్ చేస్తూ ఇంటర్‌బోర్డు ఉత్తర్వులు

గుంటూరు(విద్య), మార్చి 29: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో లైబ్రేరియన్‌గా పనిచేస్తూ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఉద్యోగిని సస్పెండ్ చేస్తూ ఇంటర్‌బోర్డు అధికారులు ఉత్తర్వులు జారీచేశారు. పెనుమాకలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో లైబ్రేరియన్‌గా పనిచేస్తున్న మస్తాన్‌వలి డిప్యూటేషన్‌పై ఎమ్మెల్యే ముస్తాఫా వద్ద పీఏగా విధులు నిర్వర్తిస్తున్నాడు. ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తూ సదరు ఉద్యోగి తూర్పు నియోజకవర్గ వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నూరిఫాతిమా తరఫున ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్నాడు. దీనిపై ఫిర్యాదులు రావడంతో కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి విచారణ చేయాల్సిందిగా ఇంటర్ బోర్డు అధికారులను ఆదేశించారు. ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్నట్లు నివేదిక అందడంలో లైబ్రేరియన్ మస్తాన్‌వలిని సస్పెండ్ చేస్తూ ఇంటర్ బోర్డు అధికారులు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.00 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	125, 134,145
చికెన్ విత్ స్కిన్	236.00
చికెన్ స్కిన్ లెస్	246.00

పల్నాడు వార్తలు


గురజాల అభివృద్ధి ప్రణాళిక పోస్టర్లను ఆవిష్కరిస్తున్న యరపతినేని శ్రీనివాసరావు

రోల్ మోడల్‌గా గురజాల ..

● నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి యరపతినేని
● అభివృద్ధిపై ప్రణాళిక పోస్టర్ ఆవిష్కరణ.. వివరాలు వెల్లడి

పిడుగురాళ్ల, మార్చి 29: టీడీపీ అధికారంలోకి వచ్చాక గురజాల నియోజకవర్గాన్ని రోల్‌మోడల్‌గా తీర్చిదిద్దుతానని, అందుకనుగుణంగా అభివృద్ధిపై తాను పక్కా ప్రణాళికతో వున్నానని గురజాల నియోజకవర్గ కూటమి అభ్యర్థి యరపతినేని శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం పిడుగురాళ్ల పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ అభివృద్ధి, విద్య, వైద్యం, వ్యవసాయరంగం, మహిళలు, అన్ని సామాజికవర్గాలకు అందించబోయే పథకాల ప్రణాళిక పోస్టర్లను ఆవిష్కరించి, అందులోని అంశాలను వెల్లడించారు. సమావేశంలో షేక్ బాబావలి, కనిగిరి శ్రీను,గండికోట వెంకటేశ్వర్లు, బడిగుంచల వెంకటేశ్వర్లు, కామిశెట్టి రమేష్, ఖాశింసైదా, మునగా వెంకట్, ఆత్మకూరి కాశీవిశ్వనాథం, కట్టమూరి ఉమామహేశ్వరరావు, సాంబయ్య, సురేష్, మాణిక్యరావు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి ప్రగతి యరపతినేని ప్రణాళిక..

1. కృష్ణానది నుండి లిఫ్ట్ఇరిగేషన్ పథకం ద్వారా సమాధానం పేట, గొట్టిముక్కల, దైద, తేలుకుట్ల గ్రామాలలోని 13 వేల ఎకరాలకు సాగునీరు
2. కృష్ణానది నుండి తంగెడ, ముత్యాలంపాడు, మాదినపాడు, సారంగపల్లి అగ్రహారం, కొత్తూరు గ్రామాలలోని 15 వేల ఎకరాలకు సాగునీరు
3. గుంటూరు మిర్చియార్డు తరహాలో నడికూడి మార్కెట్ యార్డు అభివృద్ధి, పల్నాడులోనే మిర్చి కొనుగోలు కార్యకలాపాలు వుండేలా ఏర్పాటు
4. సీసీఐ కేంద్రాల ఏర్పాటు, పంటలకు గిట్టుబాటు ధర
5. రైతులకు క్రాప్ ఇన్సూరెన్స్, పంటలకు పరిహారం అందించడం
6. రైతులకు సబ్సిడీపై ట్రాక్టర్లు, పనిముట్లు, విత్తనాల ఎరువులు
7. 500 కిలోమీటర్ల మేర గ్రామీణ ప్రాంతాలలో పంట రహదారులు నిర్మించి రైతుల పంటను ఇంటికి తెచ్చుకునే విధంగా బాటలు వేయడం
8. మోర్జంపాడు లిఫ్టిఇరిగేషన్ ద్వారా కొత్తపాలెం, మాచవరం, తురకపాలెం గ్రామాల వరకు పొడిగించి 10 వేల ఎకరాలకు అదనంగా పిల్లేరు వాగు ద్వారా 3 వేల ఎకరాలకు సాగునీరు అందించడం
9. 100 కోట్లతో జలజీవన్‌మిషన్ పథకం ద్వారా నియోజకవర్గంలోని ప్రతి ఇంటికి రక్షిత తాగునీటి కుళాయిల ఏర్పాటు
10. చిప్స్, పల్వరైజింగ్, లైమ్ ఇండస్ట్రీ యజమానులపై అక్రమ కేసుల ఎత్తివేత, పరిశ్రమలకు, వ్యాపారులకు అండగా వుండటం
11. ఆక్రమణలకు, కబ్జాలకు గురైన ప్రభుత్వ, ప్రజల ఆస్తులను విడిపించి ఆయా ప్రజలకు అప్పగించడంతో పాటు వారికి రక్షణ..
12. చిరు వ్యాపారులకు భరోసా కల్పించడం
13. జానపాడు-పిడుగురాళ్ల రైల్వే బ్రిడ్జి ఏర్పాటుకు నిధులు కేటాయించి త్వరితగతిన పూర్తి చేయించడం
14. నియోజకవర్గంలో నిలిచిపోయిన అన్ని సిమెంట్ రోడ్లను పూర్తిచేయడం
15. రూ. 100 కోట్లలతో మేజర్, మైనర్ కాల్వల ఆధునికీకరణ
16. ప్రతి మండలంలో ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలల ఏర్పాటు
17. దాచేపల్లి, పిడుగురాళ్లలో మినీ స్టేడియంలు ఏర్పాటు, క్రికెట్ సెంటర్ ఏర్పాటుతో రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడల నిర్వహణకు ఏర్పాట్లు
18. ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీలకు స్వయం ఉపాధి నిమిత్తం రూ.10 లక్షల వరకు ష్యూరిటీ లేని రుణాలు, ప్రతి గ్రామంలో అర్హత కలిగిన వారికి ఎస్సీ ఎస్టీ కార్పొరేషన్ ద్వారా రుణాలతో వెయ్యి వాహనాలు పంపిణీ
19. కోటప్పకొండ తరహాలో దైద అమరలింగేశ్వరస్వామి, గుత్తికొండబిళం, మోర్జంపాడు బుగ్గమల్లేశ్వరస్వామి, భట్రుపాలెం లక్ష్మీనరసింహస్వామి, దాచేపల్లి వీర్ల అంకమ్మతల్లి దేవాలయం అభివృద్ధితో పాటు అవసరమైన చోట కల్యాణ మండపం నిర్మించడం
20. నియోజకవర్గంలో 50కి పైగా కమ్యూనిటీ హాల్స్, షాదీఖానాల నిర్మాణం
21. భూమి కొనుగోలు పథకం ద్వారా పొలంలేని దళితులకు ఎకరం భూమి కేటాయింపు, ఎస్టీలు సాగుచేసుకుంటున్న అటవీ భూముల క్రమబద్ధీకరణ
22. మహిళా సాధికారత


వేళాంగిణి మాత ఆలయంలో ప్రత్యేక ప్రార్థనలో టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు

కూటమి అధికారంలోకి రావాలి..

● నాగపట్నంలోని వేళాంగిణిమాత చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు

గురజాలటౌన్, మార్చి 29: రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అధికారంలోకి రావాలని శుక్రవారం ఆయా పార్టీల నేతలు తమిళనాడు రాష్ట్రంలోని నాగపట్నంలో గల వేళాంగిణిమాత చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సైకో పాలన నుంచి రాష్ట్రాన్ని కాపాడాలని వేడుకున్నారు. గురజాల నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి యరపతినేని శ్రీనివాసరావు అఖండ మెజార్టీతో గెలుపొందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జనసేన కౌన్సిలర్ చింతకాయల కల్యాణ్, టీడీపీ నేతలు పెద పుల్లయ్య, పేరయ్య పాల్గొన్నారు.

కన్నా గెలవాలని ప్రత్యేక పూజలు

● నెమలిపురి నుంచి సాగరమాత ఆలయం వరకు పాదయాత్ర

రాజుపాలెం,మార్చి29: రానున్న ఎన్నికల్లో నియోజకవర్గ కూటమి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ అఖండ మెజార్టీతో విజయం సాధించాలని నాగార్జున సాగర్‌లో వెలసిన సాగర్‌మాత పుణ్యక్షేత్రంలో రాజుపాలెం మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు శనగపూల వెంకయ్య ప్రత్యేక పూజలుచేశారు. గుడ్ ఫ్రైడే సందర్భంగా ఉమ్మడి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ విజయం సాధించాలని కోరుతూ వెంకయ్య తన స్వగ్రామమైన మండలంలోని నెమలిపురి గ్రామం నుంచి సాగర్‌మాత పుణ్యక్షేత్రం వరకు కాలినడకన ప్రయాణం చేశారు. అనంతరం ఆలయ ప్రధాన పాస్టర్‌తో ప్రత్యేక ప్రార్థన చేయించారు.

టీడీపీ ప్రభుత్వంలోనే మహిళలకు రక్షణ

పెదకూరపాడు, మార్చి 29 : టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు రాష్ట్రంలోని మహిళలకు పూర్తి భద్రత కల్పించిందని పెదకూరపాడు నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి బాష్యం ప్రవీణ్ సతీమణి లావణ్య అన్నారు. మండలంలోని గారపాడులో శుక్రవారం రాత్రి బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారెంటీ పార్టీ ఎన్నికల మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ ఐదు సంవత్సరాల వైసీపీ పాలనలో మహిళల పై నిత్యం దాడులు జరుగుతున్నాయని, మహిళలు స్వేచ్ఛగా ఉండాలంటే చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి కావాలన్నారు. ఆమె వెంట పలువురు టీడీపీ నేతలు ఉన్నారు.

వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

సత్తెనపల్లి రూరల్, మార్చి 29 : మండలంలోని నందిగామలో వేంచేసివున్న వెంకటేశ్వరస్వామి 30వ వార్షిక బ్రహ్మోత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా వేకువజాము నుంచే ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, కీర్తనలు నిర్వహించారు. భక్తులు సదరు కార్యక్రమాల్లో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈనెల 30వ తేదీ ఉదయం 11 గంటలకు స్వామి వారి 30వ వార్షిక మహా కళ్యాణం జరుగుతుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి ఆలయం వద్ద అన్నదానం జరుగుతుందన్నారు. భక్తులు అధికసంఖ్యలో కల్యాణ మహోత్సవంలో పాల్గొని అన్నదానాన్ని స్వీకరించాలని వారు కోరారు.

చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలి

బెల్లంకొండ, మార్చి 29 :రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావాలని కావాలని గుంటూరు మిర్చి యార్డు మాజీ ఛైర్మన్ వెన్నా సాంబశివారెడ్డి అన్నారు. శుక్రవారం బెల్లంకొండ టీడీపీ కార్యాలయంలో మండల టీడీపీ నేతలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని టీడీపీ నేతలు ఒక గ్రూపుగా ఏర్పడి గ్రామాల్లో పర్యటించి ప్రజల సమస్యలను తెలుసుకొని వాటికి పరిష్కార మార్గం చూపించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఎంపీ అభ్యర్థి లావు శ్రీకృష్ణ దేవరాయలను, అసెంబ్లీ అభ్యర్థి భాష్యం ప్రవీణ్‌లను భారీ మెజార్టీతో గెలిపించాలని సూచించారు. సమావేశంలో టీడీపీ నేతలు మస్తాన్ షరీఫ్, లక్ష్మీనారాయణ, వెంకటరామిరెడ్డి, సముద్రం, వెంకటరావు, కొండయ్య, ఆనంద్, గంగారావు, సీతారామిరెడ్డి, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్లు

● ఇదే తెలుగుదేశం పార్టీ నినాదం, విధానం
● టీడీపీ 42వ వ్యవస్థాపక దినోత్సవంలో నేతలు
● ఆయా ప్రాంతాల్లో కేక్ కటింగ్, జెండాల ఆవిష్కరణ


సత్తెనపల్లి టీడీపీ ప్రజావేదికలో జెండాను ఆవిష్కరించిన కన్నా లక్ష్మీనారాయణ

ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్: సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్లు అనే నినాదంతో మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు స్థాపించిన తెలుగుదేశం పార్టీ అప్పటి నుంచి ఇప్పటి వరకు పేదలకు అండగా నిలిచిందని, కూడు, గూడు, గుడ్డ అనే ప్రాథమిక అవసరాలను ప్రజలకు అందించి ప్రజాభిమానాన్ని చూరగొన్నదని టీడీపీ నేతలు అన్నారు. శుక్రవారం టీడీపీ 42వ వ్యవస్థాపక దినోత్సవ కార్యక్రమాలను జిల్లాలో ఘనంగా నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లోని టీడీపీ కార్యాలయాల వద్ద నేతలు టీడీపీ జెండాలు ఆవిష్కరించారు. కేక్ కట్‌చేసి పంచి పెట్టారు. ఈ సందర్భంగా టీడీపీ వ్యవస్థాపక దినోత్సవ ప్రాధాన్యాన్ని పార్టీ శ్రేణులకు, ప్రజలకు వివరించారు.

సత్తెనపల్లి: పట్టణంలోని టీడీపీ ప్రజా వేదికలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కన్నా లక్ష్మీనారాయణ పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు ఎలినేడి రామస్వామి, చౌట శ్రీనివాసరావు, కటకం రామకృష్ణ, నూర్ బాషా జానీబాబు, ఎలినేడి లక్ష్మీ తులసీ, సయ్యద్ పెద కరిముల్లా, తదితరులు పాల్గొన్నారు.

పిడుగురాళ్ల : పిడుగురాళ్ల పార్టీ కార్యాలయం వద్ద గురజాల నియోజకవర్గ కూటమి అభ్యర్థి యరపతినేని శ్రీనివాసరావు టీడీపీ జెండా ఎగురవేసి ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా యరపతినేని మాట్లాడుతూ టీడీపీ గుర్తులోనే కార్మిక, శ్రామిక, రైతుల సంక్షేమం ముడిపడి వుందని గుర్తు చేశారు. కార్యక్రమంలో తురకా వీరస్వామి, కొమ్మినేని రామచంద్రయ్య, వడ్డవల్లి సర్వేశ్వరరావు, దియ్యా రామకృష్ణ, పణితి రవి, వడ్డవల్లి సాంబశివరావు, పిల్లి చెన్నారావు, కుంచపు గంగరాజు, వల్లెపు రామకృష్ణ, జమ్మిశెట్టి రామకృష్ణ, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

దుర్గి: మండలంలోని ధర్మవరం, శ్యామరాజపురం గ్రామాల్లో నేతలు, కార్యకర్తల మధ్య టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి జూలకంటి బ్రహ్మారెడ్డి టీడీపీ జెండాను ఎగురవేసి భారీ కేక్‌ను కట్ చేశారు. అలాగే ధర్మవరం చర్చిలో నిర్వహించిన గుడ్‌ఫ్రైడే వేడుకల్లో బ్రహ్మారెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ చిరుమామిళ్ల మధుబాబు, మార్కెట్‌యార్డు మాజీ ఛైర్మన్ యాగంటి మల్లికార్జునరావు, నేతలు శివారెడ్డి, దాసు, వజ్రంనాయక్, తదితరులు పాల్గొన్నారు.

అమరావతి: అమరావతిలోని పార్టీ కార్యాలయంలో టీడీపీ నేతలు పార్టీ జండాను ఆవిష్కరించి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల, వివిధ గ్రామాల టీడీపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కారంపూడి: మండల కేంద్రమైన కారంపూడిలోని పార్టీ కార్యాలయం వద్ద టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పంగులూరి అంజయ్య, మండల, పట్టణ నేతలు పలువురు పాల్గొని కేక్ చేశారు.

రెంటచింతల : స్థానిక టీడీపీ కార్యాలయంలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం పలువురు నేతలు మాట్లాడుతూ టీడీపీ ఆవిర్భావంతో పేదల జీవితాల్లో వెలుగులు నిండాయన్నారు. అన్ని వర్గాలకు ప్రాతినిధ్యం కల్పించే పార్టీ టీడీపీయేనన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు అబ్బిరెడ్డి, ఎన్.శ్రీనివాసరావు, గొంటు సుమంత్‌రెడ్డి, ఎం.రాజారెడ్డి, మాజీ ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

బెల్లంకొండ: స్థానిక టీడీపీ కార్యాలయంలో గుంటూరు మిర్చియార్డు మాజీఛైర్మన్ వెన్నా సాంబశివారెడ్డి, రాష్ట్ర మైనార్టీసెల్ ప్రధాన కార్యదర్శి పీఎస్‌కే మస్తాన్ షరీఫ్ టీడీపీ ఆవిష్కరించారు. చంద్రాజుపాలెం, పాపాయపాలెం, మాచాయపాలెం, న్యూ చిట్యాల ఆర్‌అండ్‌ఆర్ సెంటర్ పార్టీకార్యాలయాల్లో ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళులర్పించారు.

దాచేపల్లి : స్థానిక టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన టీడీపీ ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమంలో టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు హాజరయ్యారు. టీడీపీ మండల కన్వీనర్ పార్టీ జెండాను ఆవిష్కరించగా నేతలు డాక్టర్ కనుమూరి విక్రాంత్ తంగెళ్ల శ్రీను, డాక్టర్ కర్నాటి వరలక్ష్మీ, పుల్లయ్య, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

క్రోసూరు: అమరావతి రోడ్డులోని నియోజక వర్గ టీడీపీ కార్యాలయం వద్ద టీడీపీ జెండా ఎగుర వేశారు. మిఠాయిలు, పండ్లు, పులిహోర పొట్లాలను పంపిణీ చేశారు. ఎన్టీఆర్ చిత్రపటానికి సెంటర్‌లోవున్న ఎన్‌టీఆర్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నేత కాంద్రు కాశయ్య, గుడిపాడు బాషా, బాలరామకృష్ణంరాజు, భాష్యం ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు. ఊటుకూరు, అందుకూరు, బాలెమర్రు పీసపాడు, ఉయ్యందన, 88 తాళ్ళూరు, దొడ్లేరు, అనంతవరం, ఎర్రబాలెంలలో టీడీపీ ఆవిర్భావ వేడుకలు నిర్వహించారు.

పెదకూరపాడు : పెదకూరపాడులోని టీడీపీ మండల అధ్యక్షుడు అర్తిమళ్ల రమేష్ గృహం వద్ద టీడీపీ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ నేతలు పాల్గొన్నారు.

నకరికల్లు : నకరికల్లులోని పార్టీ కార్యాలయంలో టీడీపీ నేతలు ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు తిరుమలశెట్టి వెంకటరావు, దూదేకుల హుస్సేన్ బీ, సంగుల అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

రాజుపాలెం : స్థానిక టీడీపీ కార్యాలయం వద్ద టీడీపీ మండల అధ్యక్షుడు పల్లపాటి పెద్దిరాజు టీడీపీజెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో జనసేన పార్టీ మండల అధ్యక్షుడు తోట నరసయ్య, తెలుగు మహిళ మండల అధ్యక్షురాలు నెల్లూరి అహల్యారాణి పాల్గొన్నారు.


పిడుగురాళ్లలో జరిగిన టీడీపీ ఆవిర్భావ దినోత్సవంలో యరపతినేని


దుర్గి మండలం ధర్మవరంలో టీడీపీ జెండాను ఆవిష్కరిస్తున్న బ్రహ్మారెడ్డి

ప్రశాంత ఎన్నికలకు సహకరించండి

సత్తెనపల్లి,మార్చి29: నియోజకవర్గంలో ప్రశాంత ఎన్నికలకు ప్రజలంతా సహకరించాలని సత్తెనపల్లి డీఎస్పీ గురునాథ బాబు అన్నారు. ఎన్నికలను ప్రజలను చైతన్య వంతులను చేసేందుకు ప్రత్యేక బలగాలతో శుక్రవారం సాయంత్రం రంగా కాలనీ, రైల్వే స్టేషన్ రోడ్డులో కవాతు నిర్వహించారు. ప్రజలంతా స్వచ్ఛందంగా ఓటు హక్కును వినియోగించు కోవాలన్నారు. పోలీసులు ఎప్పుడూ ప్రజలకు రక్షణగా ఉంటారని తెలిపారు. కవాతులో సీఐ, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

బెల్లంకొండ, బెల్లంకొండ మండలంలోని చంద్రాజు పాలెంలో శుక్రవారం సాయంత్రం స్థానిక ఎస్ఐ రాజేష్ ఆధ్వర్యంలో పోలీసు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేలా సహకరించాలని ప్రజలకు కోరారు. అనంతరం వీధుల్లో కవాతు నిర్వహించారు. జిల్లా ఎస్పీ శివ శంకర్ ఆదేశాల మేరకు కవాతు నిర్వహించినట్లు ఎస్ఐ తెలిపారు.

వైభవంగా పోలేరమ్మ తల్లి తిరునాళ్ళ

నకరికల్లు, మార్చి 29 : మండలంలోని దేచవరంలోని పోలేరమ్మ తల్లి భక్తులు శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ దేవత పోలేరమ్మ తల్లి తిరునాళ్ళను పురస్కరించుకొని మహిళలు పొంగళ్ళు చేసి మొక్కుబడులు చెల్లించుకున్నారు. ప్రజలంతా సుఖ సంతోషాలతో జీవించాలని పూజలు చేశారు.

పల్లెల ప్రగతి టీడీపీతోనే సాధ్యం

వెల్దుర్తి, మార్చి 29: పల్లెలు అభివృద్ధి చెందాలంటే టీడీపీతోనే సాధ్యమని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి జూలకంటి బ్రహ్మారెడ్డి తనయుడు గౌతమ్‌రెడ్డి అన్నారు. మండలంలోని మిట్టమీదపల్లెలో శుక్రవారం జరిగిన బాబు ష్యూరిటీ - భవిష్యత్ గ్యారంటీలో కార్యక్రమంలో పాల్గొన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే అమలు చేయనున్న సూపర్ 6 పథకాలను ఇంటింటికి తిరిగి వివరించారు. మాచర్ల నియోజకవర్గం అభివృద్ధి చెందాలంటే బ్రహ్మారెడ్డిని అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

ఫుట్ బాల్ జట్టు ఎంపిక

సత్తెనపల్లి, మార్చి 29: పల్నాడు జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక సుగాలీకాలనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం అండర్-20 బాలుర ఫుట్ జట్టును ఎంపిక చేశారు. ఎంపికైన జట్టు ఈనెల 30వ తదీ నుంచి ఏప్రిల్ వ తేదీ వరకు ఆచార్య నాగార్జున యూనివర్శిటీలో జరిగే రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ టోర్నమెంట్ శిక్షణా శిబిరంలో పాల్గొంటాయని పల్నాడుజిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ నిర్వాహకులు సుబ్రహ్మణ్యేశ్వరరావు, రామిరెడ్డి, ఎండీ రియాజ్, ఐఎస్ నాగిరెడ్డిలు తెలిపారు.

దరఖాస్తు గడువు పొడిగింపు

నకరికల్లు, మార్చి 29 : దేచవరం మోడల్ స్కూల్లో 6వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకొనేందుకు ఏప్రిల్ 6 వరకు గడువు పొడిగించినట్టు ప్రిన్సిపాల్ వెళాంగిని మేరీ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2024 - 25 విద్యా సంవత్సరంలో ప్రవేశానికి మార్చి 31 వరకు మాత్రమే గడువు ఇవ్వగా, ఇప్పుడు ఏప్రిల్ 6వ తేదీ వరకు ఆ గడువును పొడిగించినట్టు ఏపీ ఆదర్శ పాఠశాలల సెక్రటరీ వెంకటకృష్ణారెడ్డి ఉత్తర్వులు జారీచేశారన్నారు. ఏప్రిల్ 21న ఆదర్శ పాఠశాలల్లో ప్రవేశానికి ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్టు తెలిపారు. ఆన్‌లైన్‌లో www.cse.ap.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించి ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఘనంగా బయ్యవరం, 88 తాళ్ళూరు తిరునాళ్ల

క్రోసూరు, మార్చి 29 : మండలంలోని బయ్యవరం, 88 తాళ్ళూరు గ్రామాల్లో లక్ష్మీ తిరుపతమ్మ తల్లి, గోపయ్య స్వామి వార్ల తిరునాళ్ళ మహోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా రెండు గ్రామాల్లోని దేవాలయాలను పెద్దసంఖ్యలో భక్తులు సందర్శించి మొక్కుబడులు చెల్లించుకున్నారు.బయ్యవరంలో తిరునాళ్ళ సందర్భంగా స్వామి వార్లకు శాంతికల్యాణం నిర్వహించారు. ఎలక్ట్రికల్ ప్రభలతో సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. 88 తాళ్ళూరులో వేలాది సంఖ్యలో భక్తులు దేవాలయాన్ని సందర్శించి పూజా కార్యక్రమాలను నిర్వహించారు.

బీసీలకు అండగా టీడీపీ

అచ్చంపేట,మార్చి 29: బీసీలకు అండగా నిలుస్తున్న పార్టీ టీడీపీయేనని బీసీ లీగల్ సెల్ జిలా నేత సరిపూడి నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం స్థానిక సాయి బాబా కళ్యాణ మండపంలో జయహో బీసీ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల పరిషత్ అధ్యక్షుడు నందిగం ఆశీర్వాదం అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సరిపూడి నాగేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్ర భవిష్యత్ బంగారు బాట కావాలంటే టీడీపీని గెలిపించు కోవాలన్నారు. కార్యక్రమంలో బత్తుల శ్రీనివాసరావు, అయ్యపరాజు, కృష్ణమ్మ, ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారులకు అండగా ఎంపీ లావు

విజయపురిసౌత్, మార్చి 29: నరసరావుపేట పార్లమెంట్ కూటమి అభ్యర్థి లావు శ్రీకృష్ణ దేవరాయలు మత్స్యకారులకు అండగా నిలవడం అభినందనీయమని మత్స్యకారుల సంఘం మాజీ అధ్యక్షుడు ఎరుపల్లి వెంకటేశ్వర్లు అన్నారు. సాగర్ డ్యాం నిర్మాణ సమయం నుంచి అభివృద్ధికి నోచుకోని స్థానిక సాగర్‌క్యాంపు, డౌన్ మార్కెట్ మత్స్యకారుల కాలనీలను శ్రీకృష్ణదేవరాయలు దత్తతు తీసుకోవడం హర్షణీయమన్నారు.


కరపత్రాలను ఆవిష్కరించిన కన్నా లక్ష్మీనారాయణ, లావు శ్రీ కృష్ణ దేవరాయులు

చంద్రబాబును సీఎం చేయాల్సిన బాధ్యత యువతదే

● లావు శ్రీకృష్ణదేరాయులు, కన్నా లక్ష్మీనారాయరణ

సత్తెనపల్లి, మార్చి 29 : యువతను మోసం చేసిన వైఎస్ జగన్‌ను గద్దె దించి చంద్రబాబును ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన బాధ్యత యువతదేనని నియోజక వర్గ కూటమి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ, నరసరావుపేట ఎంపీ అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. ముప్పాళ్ళ మండలం ఇరుకుపాలెంలో సత్తెనపల్లి నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు చిన్న బోయిన రాఘవయాదవ్ ఆధ్వర్యంలో కరపత్రాలను శుక్రవారం వారిరువురు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారిరువురు మాట్లాడుతూ అధికారంలోకి రాక ముందు వైఎస్ జగన్ యువతకు ఇచ్చిన హామీలను విస్మరించారన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్ జగన్‌కు బుద్ధి చెప్పి టీడీపీని అధికారంలోకి తీసుకొచ్చే బాధ్యత యువతపై ఉందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు బత్తుల నాగేశ్వరరావు, ఉమాదేవి, రావిపాటి మధుబాబు, దరువూరి శ్రీనివాసరావు, వెంకటేశ్వర్లు, ఏడుకొండలు, ప్రసాదు, అజయ్, టీడీపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.


జూపూడి టిడీపీ నాయకులతో మాట్లాడుతున్న భాష్యం ప్రవీణ్

పార్టీ గెలుపునకు కృషి చేయండి

● పెదకూరపాడు నియోజకవర్గ కూటమి అభ్యర్థి భాష్యం ప్రవీణ్

అమరావతి, మార్చి 29: ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో టీడీపీ , కూటమి నేతలు, శ్రేణులు పార్టీ గెలుపునకు శక్తివంచన లేకుండా కృషిచేయాలని పెదకూరపాడు నియోజకవర్గ కూటమి అభ్యర్థి భాష్యం ప్రవీణ్ కోరారు. శుక్రవారం మండల పరిధిలోని మల్లాది, మునగోడు, అత్తలూరు, జూపూడి గ్రామాల్లో స్థానిక నేతలతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించారు. టీడీపీ నేతలు బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలను కలుపుకుని ప్రతి గ్రామంలో టీడీపీ అత్యధిక మెజారిటీ సాధించేలా కృషిచేయాలన్నారు. కూటమి ఎన్నికల మ్యానిఫెస్టోను ప్రజలకు వివరించి సైకిల్ గుర్తుపై ఓటు వేసేలా అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో మండల టీడీపీ నాయకులతో పాటు ఆయా గ్రామాల మూడు పార్టీల నాయకులు పాల్గొన్నారు.


విశ్వబ్రాహ్మణ డిక్లరేషన్ పత్రాన్ని ఆవిష్కరిస్తున్న యరపతినేని శ్రీనివాసరావు

విశ్వబ్రాహ్మణుల సంక్షేమానికి కృషి

● గురజాల నియోజకవర్గ కూటమి అభ్యర్థి యరపతినేని శ్రీనివాసరావు

పిడుగురాళ్ల, మార్చి29: గురజాల నియోజకవర్గంలో విశ్వబ్రాహ్మణుల సంక్షేమానికి తనవంతు కృషి చేస్తానని గురజాల నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి యరపతినేని శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం విశ్వబ్రాహ్మణుల సంఘ నేతల సమక్షంలో డిక్లరేషన్ పత్రాలను ఆవిష్కరించారు. నియోజకవర్గం లోని ప్రతి ఇంటికి డిక్లరేషన్ యొక్కఉపయోగాలు, టీడీపీ అధికారంలోకి వచ్చాక కలిగే ప్రయోజనాలను వివరించాలని యరపతినేని కోరారు. ఈ కార్యక్రమంలో కొలగాని నంద వీరప్రసాద్, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ నాసరయ్య, విష్ణు, బ్రహ్మం, వెంకటాచారి, లక్ష్మణాచారి, శ్రీనివాసు, రమేష్ పాల్గొన్నారు.


ధర్మవరంలో పర్యటిస్తున్న బ్రహ్మారెడ్డి, ప్రచారంలో పాల్గొన్న టీడీపీ నేతలు

అన్నాదమ్ముళ్ల అరాచకాలకు అడ్డుకట్ట వేద్దాం

● టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బ్రహ్మారెడ్డి

దుర్గి, మార్చి 29: వైసీపీ రౌడీలు, గూండాలు, అరాచక శక్తుల బెదిరింపులకు నియోజకవర్గ ప్రజలు భయపడేకొద్దీ వారు భయపెడుతూనే ఉంటారని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి జూలకంటి బ్రహ్మారెడ్డి అన్నారు. పిన్నెల్లి బ్రదర్స్ దాడులు చేస్తుంటే పల్నాటి పౌరుషం సచ్చిపోయిందా అంటూ నిప్పులు చెరిగారు. బాబు ష్యూరిటీ - భవిష్యత్ గ్యారంటీలో భాగంగా శుక్రవారం మండలంలోని శ్యామరాజపురం, ధర్మవరం, రాజానగర్, గజాపురం, కోలగుట్ల, లక్ష్మీపురం తండాల్లో బ్రహ్మారెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మాచర్ల నియోజకవర్గంలో అరాచకాలు చంబల్‌లోయను మించిపోయిందన్నారు. పిన్నెల్లి సోదరుల ధనదాహానికి అడ్డూ అదుపూ లేకుండా ఉందన్నారు. 20 ఏళ్లు శాసనసభ్యునిగా ఉన్న రామకృష్ణారెడ్డి నియోజకవర్గ ప్రజలకు ఒరగబెట్టిందేమీ లేదన్నారు. ఎంతో విద్యావంతుడు, యువకుడైన ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు వైసీపీ అరాచకాలు చూడలేక టీడీపీలో చేరారన్నారు. బుల్లెట్లు దింపడం, తొడలు కొట్టడం తమకురాదని, అభివృద్ధి చేయడం మాత్రమే వచ్చని అనిల్‌కుమార్ యాదవ్‌ను ఉద్దేశించి అన్నారు. 'నాకు ఒక్క అవకాశం ఇవ్వండి.. మీకు మీ ఆస్తులకు ప్రాథమిక హక్కులను, రక్షణ కల్పించి అవినీతి శక్తులను అణచివేస్తాను' అని బ్రహ్మారెడ్డి అన్నారు.

మానవాళి పాప క్షమాపణ దినం 'గుడ్ ఫ్రైడే'

ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్ : మానవాళి పాప క్షమాపణ నిమిత్తం ఏసుక్రీస్తు శిలువపై మరణిం చిన పవిత్రదినాన్ని క్రైస్తవులు గుడ్‌ఫ్రైడేగా జరుపుకున్నారు. 40 రోజులుగా ఉపవాస దీక్షలు చేస్తున్న క్రైస్తవులు శుక్రవారం ఉపవాస దీక్షను విరమించారు. ఈమేరకు చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఏసుప్రభువు 3వ రోజు మృత్యుంజయుడిగా తిరిగి లేవటాన్ని ఆదివారం ఈస్టర్ పండుగా జరుపుకోనున్నారు.

మాచర్లటౌన్: పట్టణంలోని 18వ వార్డు తెలుగు బాప్టిస్టు చర్చిలో మాచర్ల శాసనసభ్యుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ ఛైర్మన్ మాచర్ల చిన ఏసోబు, మాచర్ల సుందరరావు తదితరులు పాల్గొన్నారు.


మాచవరంలో ప్రార్థనలు నిర్వహిస్తున్న భక్తులు

కారంపూడి: స్థానిక లూథరన్ చర్చి, సెయింట్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ ఆవరణలోని చర్చి, చింతపల్లి, పేటసన్నిగండ్ల, కొదమగుండ్ల, ఒప్పిచర్ల తదితర గ్రామాల్లోని చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు జరిపారు.

సత్తెనపల్లి: పట్టణ, మండలంలోని చర్చిలలో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్దనలు చేశారు. ఉపవాస దీక్షలను విరమించారు.

అమరావతి: పల్లోటి చర్చీ ఆధ్వర్యంలో అమరావతి ప్రధాన వీధిలో శిలువయాత్ర నిర్వహించారు. ధరణికోటగ్రామంలోని లూథరన్ చర్చిలో పాస్టర్ సత్యానంద్‌కుమార్ ప్రత్యేక ప్రార్దనలు నిర్వహించారు.

రెంటచింతల: స్థానిక ఆర్‌సీఎం, లూథరన్ చర్చిల్లో క్రైస్తవులు ప్రార్థనలు నిర్వహించారు. క్రీస్తు శిలువను మోసి సమాజానికి మంచి సందేశం ఇచ్చారు. కానుకమాత ఆలయంలో ఫాదర్ వైఎల్ మర్రెడ్డి, లూథరన్ చర్చిలో పాస్టర్ కటికల ఏసు దానం, తుమ్మకోటలో మాజీ బిషప్ రెవరెండ్ డేగల యోహాన్ తదితరులు కల్వరిలో సిలువ మరణం పవిత్ర త్యాగాన్ని కళ్లకు కట్టినట్లుగా వివరించారు.

సత్తెనపల్లి రూరల్ : మండలంలోని గ్రామాల్లో గుడ్‌ఫ్రైడేను భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. ఆయాగ్రామాల్లోని చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. గుడ్ ఫ్రైడే ప్రాముఖ్యతను, ఏసుక్రీస్తుకు శిలువవేసిన విధా నాన్ని ఫాస్టర్లు భక్తులకు వివరించారు. భక్తులు శిలువ మోస్తూ ప్రత్యేక గీతాలు ఆలపిస్తూ వీధుల్లో ప్రదర్శన నిర్వహించారు.

రాజుపాలెం: మండలంలోని పలు గ్రామాల్లో ఘనంగా గుడ్‌ఫ్రైడే నిర్వహించారు. చర్చిలను విద్యుద్దీప అలంకరణతో ముస్తాబు చేశారు.


రెంటచింతల, మాచవరంలలో శిలువను మోస్తున్న భక్తులు

చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

మాచవరం : మండలంలోని అన్ని గ్రామాలలో గుడ్‌ఫ్రైడే వేడుకలను ఘనంగా నిర్వహించారు. తెల్లవారు జామునుండి ఆయాగ్రామాల చర్చిలలో ప్రత్యేకప్రార్థనలు నిర్వహించి క్రీస్తుగీతాలాపనలు ఆలపించారు. కార్యక్రమాలలో పాస్టర్లు జీవితప్రకాష్, గురుప్రసాద్, పేరం సుందరరావులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

క్రోసూరు : ఏసుక్రీస్తు ప్రవచించిన ప్రేమ, దయ, క్షమ గుణాన్ని ప్రతి ఒక్కరు అలవర్చు కోవాలని ఏఈఎల్‌సీ చర్చి ఫాస్టర్ డాక్టర్ రెవరెండ్ సుందరరావు అన్నారు. గుడ్ ఫ్రైడే సందర్భంగా చర్చిలో తెల్లవారు జాము నుంచే ప్రత్యేక ప్రార్దనలు చేశారు. అనంతరం అన్నదానం నిర్వహించారు.

అచ్చంపేట : మండలంలోని తాడువాయి ఆర్‌సీఎం క్రైస్తవులు శిలువను మోస్తూ శిలువ మార్గాన్ని పాటించారు. తాళ్ళ చెరువులోని ఆర్‌సీఎం క్రైస్తవులు ఏసుక్రీస్తు జీవిత చరిత్ర పై ముఖ్య నాటకాన్ని ప్రదర్శించారు. తాడువాయి, చెరుకుంపాలెం, తాళ్ళచెరువు, అచ్చంపేట, కోగంటివారిపాలెం గ్రామాల్లోని ఆర్‌సీఎం క్రైస్తవులు ఉపవాస దీక్షలు విరమించారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట



ఈవీఎంలు భద్రపరచిన గోడౌన్‌లను రాజకీయ పార్టీల నాయకులతో కలసి పరిశీలించిన కలెక్టర్ శివశంకర్ లోతేటి

ఈవీఎంల గోడౌన్ల వద్ద పటిష్ఠ బందోబస్తు

● కలెక్టర్ శివశంకర్ లోతేటి

నరసరావుపేట రూరల్, మార్చి 29: రానున్న సార్వత్రిక ఎన్నికలకు సంబంధించిన ఈవీఎంలను భద్రపరచిన గోడౌన్స్ వద్ద పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి తెలిపారు. శుక్రవారం ఉదయం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శివశంకర్ లోతేటి సార్వత్రిక ఎన్నికలు ప్రక్రియలో భాగంగా నరసరావుపేట ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఉన్న మార్కెట్ యార్డు గోడౌన్లలో భద్రపరిచిన ఈవీఎం మిషన్లను పలు రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి తనిఖీచేశారు. భద్రత పరిస్థితులను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల విధులలో అలసత్వం ప్రదర్శించవద్దని సూచించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి శ్రీవినాయకం, రెవెన్యూ డివిజనల్ అధికారి సరోజ, ఈవీఎం మిషన్ల నోడల్ అధికారి అజయ్ కుమార్, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను ఆకస్మిక తనిఖీచేసి తగు సూచనలు సలహాలు అందజేశారు.



మాజీమంత్రి ప్రత్తిపాటిని కలసిన పాస్టర్లు

పాస్టర్లకు తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుంది

● మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట అర్బన్, మార్చి 29 : ప్రజలకు దగ్గరగా ఉంటూ వారి కష్టనష్టాలను దగ్గరగా చూసి పరిష్కారానికి ప్రయత్నించే క్రైస్తవ మత బోధకులకు తెలుగుదేశం ప్రభుత్వం ఎప్పుడూ అండగా ఉంటుందని, సమాజ హితంకోసం వారికి ఎల్లప్పుడు చేయూత అందిస్తామని మాజీమంత్రి, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. శుక్రవారం చిలకలూరిపేటలో ప్రత్తిపాటి నివాసంలో ఆయనను జీసెస్ ప్రేయర్ ఫెలోషిప్ జీసెస్ హెల్ప్ పాస్టర్స్ ఫెలోషిప్ ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వివిధ చర్చిల్లో పనిచేస్తున్న పాస్టర్ల సమస్యలను ప్రత్తిపాటి అడిగి తెలుసుకున్నారు. ప్రభువు ప్రవచనాలను ప్రజల్లోకి తీసుకువెళ్ళి సమాజం సన్మార్గంలో నడిచేలా బోధిస్తున్నారని వారిని కొనియాడారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక పాస్టర్లు, క్రైస్తవ సమాజం అవసరాలు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. చర్చి నిర్మాణానికి పాస్టర్లకు తగిన సహకారం అందిస్తామని క్రైస్తవుల ఆస్తులను, చర్చిలను పరిరక్షిస్తామన్నారు.



నరసరావుపేట పట్టణంలో పన్నులపై అవగాహన కలిగిస్తున్న మునిసిపల్ కమిషనర్ రవిచంద్రరెడ్డి

పన్ను వడ్డీ రాయితీని సద్వినియోగం చేసుకోవాలి

● మునిసిపల్ కమిషనర్ రవిచంద్రరెడ్డి

నరసరావుపేట రూరల్, మార్చి 29: రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న పన్ను వడ్డీ రాయితీని పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నరసరావుపేట మునిసిపల్ కమిషనర్ సి.రవిచంద్రరెడ్డి తెలిపారు. నరసరావుపేట మునిసిపాలిటీ పరిధిలో పెద్ద మొత్తంలో పన్ను బకాయి ఉన్నవారి వద్దకు స్వయంగా కమిషనర్ వెళ్లి వసూలు చేశారు. శుక్రవారం బకాయి ఉన్న వారి వద్దకు వెళ్ళి రూ.3.5 లక్ష రూపాయలు పన్ను కట్టించి వారికి రసీదులు అందజేశారు. ఈ ఆర్థిక సంవత్సరానికి పన్ను బకాయి ఉన్న వారందరూ ప్రభుత్వం కల్పించిన వడ్డీ రాయితీతో పన్ను చెల్లించి పురపాలక సంఘం వారికి సహకరించాలని కోరారు. అదేవిధంగా ఇంకా రెండు రోజులు మాత్రమే గడువు ఉన్నదని, పురపాలక సంఘంలో ఏర్పాటుచేసిన ప్రత్యేక కౌంటర్లు వద్ద లేదా మొబైల్ కౌంటర్ల వద్ద పన్ను చెల్లించి తగు రసీదు పొందాలని కోరారు. 31వ తేదీ ఆదివారం అయినప్పటికీ కూడా పురపాలక సంఘం, మొబైల్ కౌంటర్లు పనిచేయడం జరుగుతుందని మునిసిపల్ కమిషనర్ సి రవిచంద్రరెడ్డి తెలిపారు.



లీలావతి సమక్షంలో టీడీపీలో చేరిన 27వ వార్డు వైసీపీ నాయకులు

వినుకొండ అభివృద్ధి జీవీతోనే సాధ్యం

● శివశక్తి లీలా అంజన్ ఫౌండేషన్ చైర్మన్ గోనుగుంట్ల లీలావతి

వినుకొండ టౌన్, మార్చి 29: వినుకొండ నియోజకవర్గ అభివృద్ధి తెలుగుదేశం పార్టీ అభ్యర్థి జీవీ ఆంజనేయులు విజయంతోనే సాధ్యమని శివశక్తి లీలా అంజన్ ఫౌండేషన్ చైర్మన్, జీవీ ఆంజనేయులు సతీమణి గోనుగుంట్ల లీలావతి అన్నారు. పట్టణంలోని 27వ వార్డులో వైసీపీ నుంచి 25 కుటుంబాలు తెలుగుదేశం పార్టీలో శుక్రవారం చేరారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో లీలావతి మాట్లాడుతూ వినుకొండను అవినీతిరహితంగా తీర్చిదిద్దాలంటే బొల్లాలాంటి వారి కబంధహస్తాల నుంచి నియోజకవర్గాన్ని విడిపించాలన్నారు. జీవీ ఆంజనేయులు ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తారన్నారు. గతంలో రెండు దఫాలుగా ఎమ్మెల్యేగా ఉన్న ఆంజనేయులు చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అందుకు నిదర్శమన్నారు. పట్టణ ప్రజలకు జీవీచేసిన మంచే ఎన్నికల్లో తమను గెలిపించి తీరుతుందని లీలావతి ధీమా వ్యక్తం చేశారు. పార్టీలో సంపెంగుల పెద్దినర్సి, శాంతకుమారి, కృపయ్య, దాసరి కోటయ్య, చినమాణిక్యరావు, పెదమాణిక్యరావు, సంపెంగుల పవన్, దాసరి లాజర్, సంపెంగుల తేజ, చెందు, షేక్ బాజి, ఆదాం, మురికిపూడికాశి, సంపెంగుల హిజ్జమ్మ, రాజు, నాగరాజు, గండికోట కళ్యాణ్ తదితరులు పార్టీలో చేరారు. వారికి లీలావతి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు ఆయూబ్‌ఖాన్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి షమీమ్, జానీబాషా, రాంబాబు, పఠాన్ దస్తగిరి, నాగార్జున, పల్లె వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ముదిరాజుల సమ్మేళనం

వినుకొండ టౌన్, మార్చి 29: పట్టణంలోని నిమ్మలబావి బజారులో అంకమ్మ తల్లి దేవాలయంలో గురువారం ముదిరాజుల సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ వర్ల నారాయణ ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లడుతూ రాష్ట్ర వ్యాప్తంగా అత్యధిక జనాభాకల్గిన ముదిరాజులను బీసీ జాబితాలో బీపీ ఏగా మార్చాలని ఈ సందర్భంగా ఆయన డిమాండ్ చేశారు. రానున్న ఎన్నికల్లో పోటీ చేసే వివిధ రాజకీయ పార్టీలు వారి మ్యానిఫెస్టోలో ఈ అంశాన్ని చేర్చాలని డిమాండ్ చేశారు. ఏ సమస్యవచ్చినా అందుబాటులో ఉండి సమస్య పరిష్కారానికి కృషిచేస్తానని అన్నారు. కార్యక్రమంలో ముదిరాజుల కమ్యూనిటీ స్టేట్ జనరల్ సెక్రటరీ రాజు, బద్దిక వెంకటనరసింహరావు, వగ్గు శ్రీనివాసరావు, రామాంజనేయులు, వెంకటరావు, జి.శ్రీను, చిట్టేటి అంకమ్మరావు, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.



యడ్లపాడులో శిలువతో యాత్ర నిర్వహిస్తున్న క్రైస్తవులు

భక్తిశ్రద్ధలతో గుడ్‌ఫ్రైడే

చిలకలూరిపేట, మార్చి 29: పట్టణంలోని ప్రముఖ చర్చిల్లో గుడ్ ఫ్రైడే సందర్భంగా భక్తి శ్రద్ధలతో ప్రార్థనలు జరిగాయి. తండ్రి సన్నిధి, శాంతి నిలయం, క్రిష్టియన్ అసెంబ్లీ, ఈస్ట్ క్రిష్టియన్‌పేట, రాగన్నపాలెం, సంజీవ నగర్‌లలో ఉన్న లూథరన్ చర్చిల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

● నాదెండ్ల: మండలంలోని పలు గ్రామాల్లో లూథరన్, బాప్టిస్ట్, హెబ్రోన్ తదితర సంఘాలకు చెందిన చర్చిల్లో శిలువపై ఏసుక్రీస్తు మరణం గురించి వివరిస్తూ పాస్టర్లు సందేశాలు ఇచ్చారు. శిలువపై ఏసుక్రీస్తు మాట్లాడిన ఏడు మాటల గురించి విశ్వాసులకు వివరించారు.

● యడ్లపాడు: ఏసుక్రీస్తు పునరుద్ధానం సందర్భంగా జరుపుకునే గుడ్ ఫ్రైడేను క్రైస్తవులు శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. యడ్లపాడు దిగువ ఎస్సీ కాలనీలోని ఆర్‌సీఎం చర్చి ఆధ్వర్యంలో కల్వరి శిలువ యాత్ర నిర్వహించారు. చర్చి వద్ద నుంచి జాతీయరహదారి సర్వీసు మార్గం మీదుగా ఎర్రకొండ వరకు సిలువ యాత్ర నిర్వహించారు. చర్చి ఫాదర్ సుభాష్ చంద్రబోస్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. యాత్రలో పలు గ్రామాల నుంచి క్రైస్తవులు భారీగా తరలివచ్చారు.

● వినుకొండ టౌన్: గుడ్‌ఫ్రైడేను పురస్కరించుకొని పట్టణంలోని పలు చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. గత 40 రోజులుగా ఉపవాసాలున్న భక్తులు ఈ రోజు గుడ్ ఫ్రైడే సందర్భంగా ఆయా చర్చిల్లో పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మాజీ ఎమ్మెల్యే జీవీ సతీమణి గోనుగుంట్ల లీలావతి నరసరావుపేట రోడ్డులోని ఇమ్మానుయేలు తెలుగుబాప్టిస్టు చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. చర్చి పాస్టర్ రెవః ఫిలిప్ ప్రత్యేక ప్రార్థనలు చేసి ఆశీర్వచనాలు అందజేశారు. కార్యక్రమంలో సంఘ ప్రెసిడెంట్ సురబిజోసఫ్, సెక్రటరి మోజెస్ తదితరులు పాల్గొన్నారు.

● ఈపూరు: గుడ్‌ఫ్రైడే సందర్భంగా చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. ప్రజలకోసం క్రీస్తు చేసిన త్యాగాలను పాస్టర్లు వివరించారు.

● శావల్యాపురం: మండలంలోని వేల్పూరు, పోట్లూరు, శావల్యాపురం, శానంపూడి, బొందిలిపాలెం, మతుకుమల్లి, కారుమంచి తదితర గ్రామాల్లోని చర్చిలలో గుడ్‌ఫ్రైడేను క్రైస్తవులు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. భక్తులు నూతన వస్త్రాలను ధరించి ప్రత్యేక ప్రార్థనలు చేసి ఏసుక్రీస్తు గీతాలను ఆలపించారు. శావల్యాపురంలోని విమోచనా ప్రార్థనా మందిరంలో పాస్టర్ యోహేజ్కేలు ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పాస్టర్లు కస్తూరి, నిస్సీ ప్రశాంతి, ప్రేమ్‌కుమార్, నిశ్కాంత్, ప్రశాంత్‌లు పాల్గొని క్రీస్తు సందేశాన్ని వినిపించారు. అనంతరం చర్చి కమిటీసభ్యులు భక్తులకు చలువపానీయాలిచ్చి ఉపవాసదీక్షను విరమింపజేశారు.

● రొంపిచర్ల: మండలంలోని గ్రామాల్లో గుడ్‌ఫ్రైడే సందర్భంగా చర్చిల్లో ప్రార్థనలు జరిగాయి. రొంపిచర్ల, మునమాక, గోగులపాడు, నలగార్లపాడు, మాచవరం తదితర గ్రామాల్లో జరిగిన ప్రార్థనల్లో అధిక సంఖ్యలో క్రైస్తవులు పాల్గొన్నారు.

ఘనంగా టీడీపీ ఆవిర్భావ దినోత్సవం

వినుకొండ, మార్చి 29 : తెలుగుదేశంపార్టీ 42వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక టిడిపిపార్టీ కార్యలయంలో పల్నాడు జిల్లా టిడిపి అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు సతీమణి గోనుగుంట్ల లీలావతి కార్యకర్తలతో కలిసి పార్టీ జెండాను ఆవిష్కరించారు. ముందుగా ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలుగుదేశంపార్టీని గెలిపించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. తెలుగుజాతి గౌరవాన్ని దిశ దశల వ్యాపింప చేసిన పార్టీ తెలుగుదేశం పార్టీ మాత్రమేనని, అన్న ఎన్‌టీఆర్ స్ఫూర్తితో ప్రతి కార్యకర్త చంద్రబాబు నాయుడు నాయకత్వంలో పనిచేయడం ఎంతో గర్వకారణమన్నారు. కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షులు ఆయుబ్‌ఖాన్, టిడిపి నాయకులు షమీమ్‌ఖాన్, పత్తి పూర్ణ, దాసరి కోటేశ్వరరావు, అజీజ్, వాసిరెడ్డి లింగమూర్తి, మన్నెం ఆదిలక్ష్మి, దస్తగిరి, గోవింద నాయక్‌లతోపాటు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● చిలకలూరిపేట అర్బన్: బడుగు, బలహీనవర్గాల అభివృద్ధి, రాజకీయ అవకాశాలే ధ్యేయంగా ఎన్‌టీఆర్ తెలుగుదేశం పార్టీని స్థాపించారని, ఉమ్మడి రాష్ట్రంలో అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిన ఘనత తెలుగు దేశం పార్టీకే దక్కుతుందని పట్టణ పార్టీ అధ్యక్షుడు పఠాన్ సమద్‌ఖాన్ అన్నారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జెండా ఎగురవేసి అనంతరం కేక్ కట్‌చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● యడ్లపాడు: టీడీపీ 43వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆ పార్టీ నాయకులు శుక్రవారం ఘనంగా నిర్వహించుకున్నారు. కూడళ్ళ వద్ద, పార్టీ కార్యాలయాల వద్ద పార్టీ పతాకాలను ఎగురవేశారు. పార్టీ వ్యవస్థాపకులు, మాజీ ముఖ్యమంత్రి దివంగత ఎన్టీఆర్‌కు నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ ఎన్టీఆర్ ఏ లక్ష్యంతో పార్టీని స్థాపించారో లక్ష్య సాధనకు మనందరం కృషిచేయాలని, పార్టీని కాపాడుకోవాలని పిలుపు నిచ్చారు. పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలలో ఆయా



చిలకలూరిపేటలో జెండా ఎగుర వేస్తున్న టీడీపీ నాయకులు

గ్రామాలకు చెందిన టీడీపీ నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

● ఈపూరు: ఈపూరు టీడీపీ కార్యాలయం వద్ద శుక్రవారం సాయంత్రం టీడీపీ 42వ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా జరుపుకున్నారు. ఎన్‌టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి రావర్ల జగ్గారావు మాట్లాడుతూ తెలుగువారి ఆత్మగౌరవం కోసం స్థాపించి పేదల అభివృద్ధికి నిరంతరం పాటుబడుతున్న టీడీపీ ప్రజల గుండెల్లో ఎప్పుడూ ఉంటుందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బొల్లా వెంకటకోటయ్య, విడపలపాటి హనుమయ్య, బెల్లంకొండ సైదులు, తిరుమలశెట్టి బాలయ్య, మద్దం వెంకట్రావు, చాపల మల్లయ్య, కాటం కోటేశ్వరరావు, గోనుగుంట్ల శ్రీనివాసరావు, నర్రా కిశోర్, బొల్లా సుబ్బారావు, మీసాల ప్రసాదు, గోపు వీరాంజినేయులు తదితరులు పాల్గొన్నారు.

బీసీ, ఎస్సీ, ఎస్టీలకు టీడీపీతోనే రాజకీయ అవకాశాలు

● టీడీపీ రాష్ట్ర ఎస్టీ సెల్ అధ్యక్షుడు ధారునాయక్

నరసరావుపేట టౌన్, మార్చి 29: అన్న నందమూరి తారకరామారావు స్థాపించిన తెలుగుదేశం పార్టీతోనే బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు రాజకీయ అవకాశాలు వచ్చాయని టీడీపీ రాష్ట్ర ఎస్టీ సెల్ అధ్యక్షుడు ఎం.ధారునాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. టీడీపీ ఆవిర్భావం సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగువారి ఆత్మగౌరవాన్ని ప్రపంచవ్యాప్తం చేసిన ఆద్యుడు అన్న నందమూరి తారకరామారావు అన్నారు. ఎన్టీఆర్ స్ఫూర్తితో టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం కృషి చేస్తున్నారని, ఆ దిశగానే బీసీ డిక్లరేషన్‌ను ప్రకటించారన్నారు. అన్నివర్గాల సంక్షేమమే ధ్యేయంగా సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయనున్నారన్నారు. జగన్‌రెడ్డి బడుగు బలహీనవర్గాల నమ్మక ద్రోహి అన్నారు. అభివృద్ధిని నిర్వీర్యం చేయటమే కాకుండా బీసీ, ఎస్టీవర్గాల మీద దాడి చేస్తున్నారన్నారు. సొంత బాబాయ్‌ని గొడ్డలితో చంపించిన జగన్‌రెడ్డిని సొంత చెల్లెలు కూడా నమ్మటం లేదన్నారు. రానున్న ఎన్నికలలో ఎన్టీఆర్ ఆశీర్వాదంతో తెలుగుదేశం అధికారంలోకి రావటం తథ్యం అన్నారు.



బొల్లాను గద్దె దించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారు: జీవీ

వినుకొండ, మార్చి 29: నియోజకవర్గంలో ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడును గద్దె దించేందుకు ప్రజలంతా సిద్ధంగా ఉన్నారని పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు హెచ్చరించారు. మండలంలోని నడిగడ్డలో వైసీపీ పార్టీ నుంచి 200 కుటుంబాలు జనసేన పార్టీ సమన్వయకర్త కొణిజేటి నాగశ్రీను ఆధ్వర్యంలో గురువారం రాత్రి జనసేన పార్టీలో చేరారు. ఈ సందర్భంగా జరిగిన సభలో పాల్గొన్న జీవీ మాట్లాడుతూ గ్రామాల్లో వైసీపీ కార్యకర్తలను రెచ్చగొట్టి బొల్లా బ్రహ్మనాయుడు గొడవలు సృష్టించేందుకు కుట్రలు పన్నుతున్నారన్నారు. నడిగడ్డ చెరువులో నీరులేక గ్రామంలో భూగర్భజలాలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. 5వేల మంది పట్టణ ప్రజలకు ఒక్క సెంటు భూమిని పట్టణానికి దగ్గరగా ఇవ్వకుండా 7 కిలోమీటర్ల దూరంలో ఎకరం 4లక్షల రూపాయలకు కొని ప్రభుత్వానికి 18 లక్షలకు 100ఎకరాలు 18కోట్లు సంపాదించుకొని ఆ డబ్బులతో హైవే పక్కన పొలాలు కొనుగోలుచేసి బొల్లా కోటీశ్వరుడు అయ్యాడని ఆరోపించారు. పేద ప్రజలకు మాత్రం కొండల్లో, గుట్టల్లో ఉన్న పొలాలను ఇళ్ళ స్థలాలకు ఇచ్చిన దుర్మార్గుడు అని విమర్శించారు. జనసేన పార్టీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు మాట్లాడుతూ వినుకొండ నియోజకవర్గాన్ని బొల్లా కబంధ హస్తాల నుంచి కాపాడేందుకు కూటమి అభ్యర్థి జీవీ ఆంజనేయులు, ఎంపీ అభ్యర్థి కృష్ణదేవరాయులకు ఓటువేసి గెలిపించాలని పిలుపునిచ్చారు. మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు మాట్లాడుతూ బొల్లా బ్రహ్మనాయుడుకు డబ్బు సంపాదన మీద ఉన్న ధ్యాస నియోజక



జనసేన పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడుతున్న జీవీ

వర్గ ప్రజలపై లేదన్నారు. పార్టీలో చేరిన ఎరబోతుల రామకృష్ణ గ్రామ పంచాయతీ వైస్ ప్రెసిడెంట్, తోట ప్రసన్న, 3వ వార్డు మెంబర్ తోట కోటయ్య, 6వ వార్డు మెంబర్ కంట చినరామంజి, 7వ వార్డు మెంబర్ యాగశిరి కోటయ్య, 11వ వార్డు మెంబర్ సవలం ఎలిగొండయ్య, 12వ వార్డు మెంబర్ తోట చిన రంగారావులతోపాటు 200 కుటుంబాలు జనసేన పార్టీలో చేరిన వారికి జీవీ ఆంజనేయులు, మాజీ శాసనసభ్యుడు, మక్కెన మల్లికార్జునరావులు పార్టీ కండువాలు కప్పి జనసేన పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో నియోజకవర్గ పార్టీ నాయకులు, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి పోగుల బ్రహ్మం, గ్రామ పార్టీ నాయకులు దేశ రామారావు, శెట్టి శ్రీను, యరబోతుల శివ, గోపి, కోదండ పాణి, గోవిందరాజులు, రమణయ్య, పోగుల మణికంట కాల్వ రాములతోపాటు జనసేన, టీడీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



శివరామిరెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అరవిందబాబు

శివరామిరెడ్డికి టీడీపీ నేతల నివాళి

రొంపిచర్ల, మార్చి 29: మండలంలోని విప్పర్లపల్లి గ్రామ మాజీ ఉప సర్పంచ్ మెట్టు శివరామిరెడ్డి ఇటీవల మృతిచెందారు. కాగా శుక్రవారం టీడీపీ జిల్లా అధ్యక్షుడు జీవీ అంజనేయులు, నరసరావుపేట టీడీపీ అసెంబ్లీ అభ్యర్థి డాక్టర్ చదలవాడ అరవిందబాబు ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. గ్రామ అభివృద్ధికి శివరామిరెడ్డి చేసిన సేవలను కొనియాడారు. మండలంలోని పలు గ్రామాల టీడీపీ నాయకులు నివాళులర్పించిన వారిలో ఉన్నారు. అరవిందబాబు వెంట పి.జగ్గయ్య, పల్లెల నాగిరెడ్డి, గాడిపర్తి సురేష్ తదితరులు ఉన్నారు.

టీడీపీ సీనియర్ నేత మృతి

బొల్లాపల్లి, మార్చి 29 : మండలంలోని పలుకూరు గ్రామానికి చెందిన సంపతి మన్నెపల్లెయ్య (56) శుక్రవారం గుండె పోటుతో మృతిచెందాడు. మన్నెపల్లెయ్య పార్టీ కార్యక్రమానికి సంబంధించి శుక్రవారం సరుకులు తీసుకు వచ్చేందుకు వచ్చి కుప్పకూలిపోయాడు. బంధువులు పక్కనే ఆస్పత్రికి తీసుకు వెళ్ళగా అప్పటికే మృతి చెందినట్టు బంధువులు తెలిపారు. మన్నె పల్లెయ్య మృతికి మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఆయన మృతదేహాన్ని సందర్శించి ఘనంగా నివాళులర్పించారు.

పోలీసుల కవాతు

నరసరావుపేట లీగల్, మార్చి 29: పట్టణంలోని ప్రధాన కూడళ్ళలో శుక్రవారం పోలీసు, బీఎస్ఎఫ్ బలగాలు కవాతు నిర్వహించాయి. త్వరలో జరగనున్న లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ప్రజల్లో మనోధైర్యాన్ని నింపేందుకు ఈ కవాతు నిర్వహిస్తున్నట్టు సీఐలు కృష్ణారెడ్డి, భాస్కర్‌లు తెలిపారు. మొదటి, రెండో పట్టణ పోలీసు స్టేషన్‌ల పరిధిలో ప్రధాన కూడళ్ళల్లో ఈ కవాతు నిర్వహించారు.

● ఈపూరు, మార్చి 29: సార్వత్రిక ఎన్నికల సందర్భంగా గ్రామాలలోని ప్రజలు ప్రశాంతంగా ఓటుహక్కు వినియోగించుకోవాలని వినుకొండ రూరల్ సీఐ ఉప్పుటూరి సుధాకర్‌రావు అన్నారు. మండలంలోని శ్రీనగర్, వనికుంట గ్రామాలలో శుక్రవారం కేంద్ర బలగాలతో కవాతు నిర్వహించారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రజాస్వామ్యబద్ధంగా గొడవలకు పోకుండా ప్రతి ఒక్కరూ ఓటు హక్కు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘించినా, అల్లర్లు సృష్టించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ ఎస్‌కే మహమ్మద్ ఫిరోజ్ పాల్గొన్నారు.



వనికుంటలో కవాతు నిర్వహిస్తున్న కేంద్ర బలగాలు



రొంపిచర్లలో ప్రార్థనల్లో పాల్గొన్న అరవిందబాబు, గోనుగుంట్ల కోటేశ్వరరావు తదితరులు

ఇఫ్తార్‌లో పాల్గొన్న లావు, చదలవాడ

రొంపిచర్ల, మార్చి 29: మండల కేంద్ర మైన రొంపిచర్ల చెరువు కట్ట సెంటర్‌లో శుక్రవారం జరిగిన ఇఫ్తార్ విందులో ఎంపీ కృష్ణ దేవరాయలు, అసెంబ్లీ అభ్యర్థి అరవింద బాబు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గోనుగుంట్ల కోటేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మసీదులో జరిగిన ప్రార్థనల్లో పాల్గొన్నారు. అనంతరం ముస్లింలకు ఇఫ్తార్‌ను అందించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ముస్లింలకు రంజాన్ మాసం ఎంతో పవిత్రమైనదన్నారు. కార్యక్రమంలో పులుకూరి జగ్గయ్య, పల్లెల నాగిరెడ్డి, గాడిపర్తి సురేష్, కల్లి మల్లారెడ్డి, పెద్దినీడి వెంకట సుబ్బారావు, మాదినీడి అంజయ్య, పల్లెల వెంకట రత్నారెడ్డి, చిన అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు యడ్లపాడు రానున్న లావు

యడ్లపాడు, మార్చి 29: టీడీపీ నరసరావుపేట పార్లమెంట్ అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరాయలు శనివారం యడ్లపాడు మండలంలో పర్యటించనున్నట్లు ఆ పార్టీ నాయకులు తెలిపారు. ఉదయం 8.30 గంటలకు మండలంలోని బోయపాలెం పార్వతిదేవి ఆలయంలో జరిగే పూజలలో పాల్గొంటారని, అనంతరం యడ్లపాడులోని పార్టీ కార్యాలయానికి చేరుకుంటారు. కార్యాలయంలో బూత్, యూనిట్ ఇన్‌చార్జిలు, కార్యకర్తలు, జనసేన, బీజేపీ నాయకులతో సమావేశమవుతారన్నారు.

మురికిపూడిలో యువకుడి హత్య

చిలకలూరిపేట, మార్చి 29: మండలంలోని మురికిపూడి గ్రామంలో ఎద్దు యోహాను (35) అనే యువకుడు హత్యకు గురయ్యాడు. యోహాను భార్యతో వివాహేతర సంబంధం పెట్టుకున్న వ్యక్తి ఈ హత్యకు పాల్పడినట్టుగా ప్రాథమిక సమాచారం. శుక్రవారం చిలకలూరిపేట రూరల్ పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నీటి సరఫరా నిలుపుదల వివాదాస్పదం

● పోలీసుల జోక్యంతో పరిష్కారం



నీరు నిలిపివేతపై తెలియజేస్తున్న పగడాల రాముడు, సుశీల దంపతులు

నూజెండ్ల, మార్చి 29: వేసవి కాలంలో గృహ అవసరాలకు నీటి సరఫరా నిలిపివేయటం వివాదంగా మారిన సంఘటన మండలంలోని తెల్లపాడు గ్రామంలో శుక్రవారం బహిర్గతమైంది. తెల్లపాడు గ్రామంలో పంచాయతీ నుంచి సక్రమంగా నీరు రాకపోవటంతో ఐదు సంవత్సరాల క్రితం సుమారు వంద కుటుంబాల వారు రెండు ఎకరాల పొలం కొని సొంతంగా బోరు, ట్యాంక్ ఏర్పాటు చేసుకొని నీటి సరఫరా చేసుకుంటున్నారు. నీటి నిర్వహణకు అయిన ఖర్చులను అందరూ భరిస్తుంటారు. అయితే పగడాల రాముడు, సుశీల దంపతులు నిర్వహణ మొత్తాలను చెల్లించటం లేదు. అంతేకాకుండా పగడాల రాముడు, సుశీల కుటుంబ సభ్యులకు గ్రామంలోని అదే సామాజిక వర్గానికి చెందిన కొందరితో విబేధాలు చోటుచేసుకున్నాయి. పైగా నీటి పంపిణీకి చెల్లించాల్సిన రుసుములు చెల్లించక పోవటంతో కాలనీవాసులు వారికి నీటి సరఫరా నిలిపివేశారు. అయితే ఇటీవల బొప్పూడిలో జరిగిన ప్రజాగళం బహిరంగ సభకు రాముడు వెళ్ళి రావటం తదితర అంశాలతో ఈ విషయం వివాదస్పదమైంది. వారికి నీరు నిలిపివేసిన విషయాన్ని ఓ యువకుడు వీడియోతీసి సోషల్ మీడియాలో పెట్టడంతో అది వెలుగులోకి వచ్చింది. దీంతో అధికారులు స్పందించారు. ఈ విషయమై ఐనవోలు ఎస్ఐ ఎం లక్ష్మీనారాయణరెడ్డి పోలీసు సిబ్బందిని గ్రామానికి పంపించి విచారణ చేయించారు. ఎన్నికల నేపథ్యంలో నీటి సరఫరా నిలిపివేయటం రాజకీయ వివాదాలకు కారణమవటంతో నీటి సరఫరాను పునరుద్ధరించి సమస్యను సామరస్యంగా పరిష్కరించుకుంటున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

ఆర్థిక వివాదాలతో వ్యక్తి అక్రమ నిర్బంధం

నరసరావుపేట లీగల్, మార్చి 29: ఆర్థిక వివాదాల నేపథ్యంలో ఓ వ్యక్తిని అక్రమంగా నిర్బంధించిన సంఘటన పట్టణంలో చోటు చేసుకుంది. సేకరించిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. బాపట్ల జిల్లా పాత మాగులూరు గ్రామానికి చెందిన తీరబోయిన వీరవెంకటేశ్వర్లు పల్నాడు జిల్లా రొంపిచర్ల మండలంలోని దాసరిపాలెంకు చెందిన శ్రీనివాసరావు, మరికొందరికి బాకీ ఉన్నాడు. ఈ నేపథ్యంలో శ్రీనివాసరావు వెంకటేశ్వర్లుపై రొంపిచర్ల పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదుమేరకు రొంపిచర్ల పోలీసులు గత శనివారం వెంకటేశ్వర్లును బాపట్ల జిల్లా అద్దంకిలో అదుపులోకి తీసుకుని, అదేరోజు రాత్రి 12గంటల సమయంలో వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల చేశారు. వెంటనే శ్రీనివాసరావు, మరికొందరు వ్యక్తులు వెంకటేశ్వర్లును బలవంతంగా అదుపులోకి తీసుకొని రొంపిచర్లలో ఓ గృహంలో నిర్బంధించి దాడిచేశారు. ఆరోగ్యం క్షీణించటంతో పట్టణంలోని మల్లమ్మ సెంటర్‌లోని ఓ వైద్యశాలలో చేర్చారు. చికిత్స పొందుతున్న వెంకటేశ్వర్లును కుటుంబ సభ్యులు కవలవకుండా శ్రీనివాసరావు, మరికొందరు ఇబ్బంది పెట్టడంతో వారు మీడియాను ఆశ్రయించారు. ఈ సంఘటనపై డీఎస్పీ దృష్టికి తీసుకురాగా డీఎస్పీ సత్యనారాయణ వర్మ తక్షణమే స్పందించి రొంపిచర్ల ఎస్ఐకి తగు ఆదేశాలు జారీచేశారు. రొంపిచర్ల ఎస్ఐ చొరవతో బాధితుడిని వైద్యశాల నుంచి తీసుకువచ్చారు. కాగా ఈ విషయమై ఏవిధమైన ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని మహిళ మృతి



ఈశ్వరమ్మ ఫైల్ ఫొటో

వినుకొండ టౌన్, మార్చి 29: గుర్తు తెలియని వాహనం ఢీకొని మహిళ మృతిచెందిన సంఘటన మండలంలోని అందుగుల కొత్తపాలెం జాతీయ రహదారిపై గురువారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు పరిశీలిస్తే రోడ్డుపై టిఫిన్ బండి పెట్టుకొని జీవనం సాగిస్తున్న చింతలపూడి ఈశ్వరమ్మ (45) రోడ్డుపై నుంచి ఇంటికి వెళ్తున్న సమయంలో గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో అక్కడిక్కడే మృతిచెందింది. ప్రమాదం జరిగిన సమయంలో రోడ్డుపై ఎవరూ లేకపోవడంతో వాహనం ఆగకుండా వెళ్లిపోయింది. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటన ప్రాంతానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కొన్నేళ్ల క్రితం భర్త మృతిచెందడంతో ఆమె టిఫిన్ బండి పెట్టుకొని జీవనం సాగిస్తున్నట్లు స్థానికులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టిన కారు: ఇద్దరికి గాయాలు

యడ్లపాడు, మార్చి 29: జాతీయ రహదారిపై యడ్లపాడు ఎస్ఎస్ఎల్ టెక్స్‌టైల్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. ముందు వెళుతున్న ద్విచక్రవాహనాన్ని వెనుక నుంచి వేగంగా దూసుకొచ్చిన కారు ఢీకొట్టడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బాపట్ల జిల్లా విజయలక్ష్మీపురం గ్రామానికి చెందిన వ్యాపారి కుక్కల శ్రీనివాసరెడ్డి శుక్రవారం సంవత్సరాంతపు లెక్కల సమర్పణకు ద్విచక్రవాహనంపై గుంటూరులోని చార్టర్డ్ అకౌంటెంట్ షేక్ కాలేషా వద్దకు వచ్చాడు. పనులు ముగించుకుని చార్టర్డ్ అకౌంటెంట్‌తో కలసి ద్విచక్రవాహనంపై చిలకలూరిపేటకు బయలుదేరాడు. యడ్లపాడు సమీపంలోని ఎస్ఎస్ఎల్ టెక్స్‌టైల్ సమీపంలో వెనుకనుంచి వేగంగా దూసుకొచ్చిన కారు ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టి వెళ్లింది. దీంతో శ్రీనివాసరెడ్డి ఎడమకాలు ఎముక విరిగి బయటకు రాగా, ఆడిటర్‌కు స్వల్పగాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108 సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని ప్రాథమిక చికిత్సనందించి గుంటూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. కాగా ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టి ఆపకుండా వెళ్లిన కారు కొద్ది నిముషాల ముందు కాటూరి మెడికల్ కళాశాల సమీపంలో యాక్సిడెంట్ చేసి ఆపకుండా వస్తూ వీరి ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టినట్లు పోలీసులు తెలిపారు. యడ్లపాడు స్టేషన్‌లో ఎస్ఐగా పనిచేసి ప్రస్తుతం టంగుటూరు ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న నాగేశ్వరరావు, కాటూరి ఆసుపత్రి వద్ద ప్రమాదానికి గురైన వ్యక్తి బంధువులు కారును వెంబడించి తిమ్మాపురం వద్ద కారును నడుపుతున్న పవన్‌కుమార్‌ను పట్టుకుని స్టేషన్‌లో అప్పగించినట్లు తెలిపారు.